
రుబెల్లా టీకా సిద్ధం



- 7 లక్షల మంది చిన్నారులకు వేయటమే లక్ష్యం
- నేటి నుంచి ప్రారంభం
- ఐదు వారాలపాటు కార్యక్రమం
- ఒకే టీకాతో రెండు వ్యాధులకు చెక్
- 9 నెలల శిశువు నుంచి 15 ఏళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరి

7 లో

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



రంగారెడ్డి

20

గురువారం 17 ఆగస్టు 2017

నిర్లక్ష్యహారం

ప్రభుత్వం చేపట్టిన హరితహారం కార్యక్రమం జిల్లాలో అభాసుపాలవుతోంది. మూడో విడత జిల్లాలో చేపట్టిన ఈ కార్య క్రమం అమల్లో అడుగడుగునా నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఈ ఏడాది హరితహారం కార్యక్రమం విజయవంతం చేసేందుకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేసినప్పటికీ అవి కాగితాలకే పరిమితమయ్యాయి. ఈ పథకం అమల్లో రాష్ట్రంలోనే జిల్లా చివరి నుంచి రెండో స్థానంలో నిలిచింది. ఈ ఏడాది 1.70 కోట్ల మొక్కలు నాటాలని సర్కార్ నిర్ధేశించగా ఇప్పటివరకు 49 లక్షల మొక్కలు నాటడం జరిగింది. మొక్కలు నాటడంలో వివిధ శాఖలు నిర్లక్ష్యం వహిస్తున్నాయనడానికి ఈ గణాం కాలే నిదర్శనం. ఈ లెక్కలు కూడా సరైనవేనా అనేది అనుమానమే.. ఈసారి వర్షాలు బాగానే కురిసినప్పటికీ మొక్కలు నాటడంలో అధికారులు తీవ్ర అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారు.. హరిత హారం కింద మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ కోసం గ్రామస్థాయిలో గ్రీన్ బ్రిగేడియర్లు (హరితసైన్యాలు) ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో జిల్లాలో కూడా బ్రిగేడియర్ల ఏర్పాటు మొదలు పెట్టారు. కానీ ఇవి పూర్తిస్థాయిలో ఇక్కడ ఇంకా ఏర్పాటు కానే లేదు.

- హరితహారంలో జిల్లా అధమ స్థానం
- ప్రభుత్వ శాఖలన్నీ దాదాపు విఫలం
- ఈ ఏడాది లక్ష్యం 1.70 కోట్లు
- ఇప్పటివరకు నాటినవి 49లక్షలు
- ఇందులో రెండుశాఖలు నాటిన మొక్కలే 40లక్షలు
- ఈ లెక్కలపైనా అనుమానాలే
- అధిక వర్షపాతం నమోదైనా ముందుకు సాగని కార్యక్రమం

7 లో

సంరక్షణ లేక అస్తవ్యస్తంగా మొక్కలు



నర్సరీలో మొక్కలు



తాగునీటి కష్టాలకు చెక్



కొంపల్లిలో తాగునీటి ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కేటీఆర్, పక్కన మహేందర్‌రెడ్డి

- గ్రేటర్‌లో 1612 కిలో మీటర్లు డిస్ట్రిబ్యూషన్ లైన్లు
- ఒక్కో వ్యక్తికి 135 లీటర్ల తాగునీరు
- సంవత్సరంలో ఇంటింటికీ స్వచ్ఛమైన వాటర్
- పేదవారి ఆత్మగౌరవానికి ప్రతీకగా డబుల్ బెడ్‌రూం..
- గ్రేటర్‌లో సంవత్సరంలో లక్ష డబుల్ బెడ్‌రూం ఇళ్లు
- హైదరాబాద్ స్లమ్ సీటిగా వద్దను కుంటే సహకరించాలి
- కొంపల్లిలో రూ. 628 కోట్లతో అర్బన్ భగీరథ పనులు ప్రారంభించిన మంత్రి కేటీఆర్
- కాంగ్రెస్ వాళ్లకి స్కామ్‌లు..టీఆర్ఎస్‌వీ స్కీములు : ఎంపీ మల్లారెడ్డి
- డీపీపల్లిలో 1600 డబుల్ బెడ్ ఇళ్ల నిర్మాణపనులకు భూమిపూజ
- షాపూర్‌లో రిజర్వాయర్ ప్రారంభం

వివరాలు 20 లో

విద్యుదాఘాతంతో రైతు మృతి

3 లో

విద్యార్థినులకు అసభ్యకరమైన మెసేజ్‌లు

- షీ టీం మహిళా కానిస్టేబుల్‌కూ తప్పని వేధింపులు
- నిర్భయ చట్టం కింద కేసులు.. యువకుడికి రిమాండ్

- వివరాలు 3లో..



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ మల్లారెడ్డి



ఎయిర్‌పోర్ట్ నుంచి బయటకు వస్తున్న ఒమన్ బాధితులు

ఎయిర్‌పోర్టుకు ఒమన్ బాధితులు

స్వాగతం పలికిన గల్ఫ్ అసోసియేషన్ సభ్యులు

3 లో

పౌల్ట్రీ రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. మైగ్రేషన్ పేరిట నిలువుదోపిడీకి గురవు తున్నారు. పౌల్ట్రీ కంపెనీలు ఆడిందే ఆట.. పాడిందే పాటగా.. మారడంతో ఏడాదికి కనీసం నాలుగు బ్యాచ్‌లు కూడా ఉత్పత్తి కాని పరిస్థితి ఏర్పడింది. వచ్చే రాబడికి కనీసం బ్యాంకు కిస్తులు కూడా కట్టలేని దుస్థితి నెలకొన్నది. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఉపాధి అటుంచి ఉన్న భూమికి ఎసరొచ్చే ప్రమాదం ఉంది. మంచాల మండలంలో బ్రాయిలర్ కోళ్లు ఉత్పత్తి చేసే పౌల్ట్రీ రైతుల కష్టాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం...

అప్పులఊబిలో పౌల్ట్రీ రైతులు

మైగ్రేషన్ పేరిట నిలువుదోపిడీ.. ● కంపెనీలు ఆడిందే ఆట..

ఏడాదికి నాలుగుబ్యాచ్‌లు కూడా రాని వైనం ● బ్యాంకు కిస్తులూ కట్టలేని దుస్థితి..

భూములు అమ్ముకుని అప్పులు తీర్చే పరిస్థితి ● బ్రాయిలర్ పౌల్ట్రీ రైతుల కష్టాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

11 లో



ఆంధ్రజ్యోతి / ఇంటర్వ్యూ

దోమల నివారణకు
టీమిఫాస్ పిచికారి

- దోమ లార్వా నిర్మూలనకు రెండు వేల గంబోజియా చేప పిల్లలు
- పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ తగిన శ్రద్ధ తీసుకోవాలి
- వికారాబాద్ జిల్లా ఇన్‌చార్జి మలేరియా అధికారి గంగప్ప



వికారాబాద్ అర్బన్: దోమల నివారణ కోసం జిల్లా వ్యాప్తంగా దోమ లార్వాల నిర్మూలన కార్యక్రమం చేపడుతున్నాం. దీన్ని టీమిఫాస్ పిచికారి కార్యక్రమంలో పిలుస్తున్నాము. ముఖ్యంగా క్యూలెక్స్ దోమవల్ల వివిధ రోగాలు వచ్చే అవకాశం ఉంటుంది. అందులో ముఖ్యంగా మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, మెదడు వాపు, బోధకాల వ్యాధులు వస్తాయి. ఈ మధ్యనే అఫ్రికాలో కన్పించే జీకా అనే వ్యాధి లక్షణాలు ఈ మధ్య కాలంలో అలహాబాద్‌తో పాటు తమిళనాడులోని కృష్ణ జిల్లాలో కనిపించాయి. ఇది దృష్టిలో ఉంచుకుని వైద్య శాఖ ఆధ్వర్యంలో దోమలు పెట్టే గుడ్ల నుంచి లార్వాలను అంతం చేయడం కోసం వివిధ రకాల కార్య క్రమాలను చేపడుతున్నాం. ఇప్పటికే జిల్లాలోని మోమిన్‌పేట, పట్లూర్, పెద్దే ముల్ పీహెచ్‌సీ పరిధిలోని ఏడెనిమిది గ్రామాలకు 1500 గంబోజియా చేప పిల్లలను పంపిణీ చేయడం జరిగింది. ఈ చేప పిల్లలను బావులు, చెరువులు, కుంటలల్లో వేశారు. క్యూలెక్స్ దోమలు ఎక్కువగా డ్రైనేజీల్లో, బావుల్లో, కుంటల్లో ఉంటాయి. క్యూలెక్స్ దోమల వ్యాప్తిని నివారించేందుకు గంబోజియా చేప పిల్లలను వదలడం జరుగుతోంది. గుడ్డుపెట్టిన దోమ లార్వా పీఫా అనే వైరస్ ఉత్పత్తి కావడానికి ఏడెనిమిది రోజులు పడుతుంది. అదే సమయంలో ఆ లార్వా, ఫిపాను నాశనం చేయడం కోసం ఈ చేప పిల్లలను వదులడం జరుగుతుంది. అదే విధంగా మున్సిపల్ పరిధిలోని ప్రధాన డ్రైనే జీల్లో సైతం ఈ గంబోజియా చేపపిల్లలను వదలడం జరుగుతుంది. ఇక్కడ 500 చేప పిల్లలను మురుగు కాల్వల్లో వదులుతున్నాం. ఇప్పటి వరకు పలు ప్రాంతాల్లో వంద చేప పిల్లలను మురుగు కాలువల్లో వదిలాం. ఈ విధానం ద్వారా దోమలు నాశనం కావడంతో పాటు పర్యావరణానికి ఎలాంటి హాని జరుగదు. అదే విధంగా ఎడిస్ దోమ ఎక్కువగా మన ఇళ్లల్లో మూతలు పెట్టకుండా ఉండే నీటిపై ఎక్కువగా కనిపిస్తుంటాయి. ఈ రకమైన దోమల ద్వారా మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వస్తుంది. ఇలాంటి దోమలు వృద్ధి కాకుండా ఉండేందుకు ప్రతి ఇంట్లో బిందెలు, సిమెంట్ తొట్టీలు, బకెట్లపై మూతలు ఏర్పాటుచేసుకోవాలి. ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేసేందుకు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నాం. వార్డుల్లోకి తిరిగి దోమల వచ్చే కలిగే నష్టాలు, అనర్థాలను వివరిస్తూ ప్రజలకు దోమల నివారణకు అనుసరించాల్సిన సూచనలు, సలహాలు అందజేస్తున్నాం. దోమల నివారణ కోసం ఎలాంటి చర్యలు చేపట్టాలో కూడా ప్రజలకు తెలియజేస్తున్నాం. ఉదాహరణకు తొటి నీటిలో టీమిఫాస్ మందును ఒక లీటర్ మంచినీటి బాటిల్‌లో పోసి ఆ నీటిని తొట్టి నీటిలో కలిపితే ఈ టైగర్ దోమ లార్వా చని పోవడం జరుగుతుంది. ఇప్పటి వరకు జిల్లాలో మలేరియా కేసులు ఎనిమిది నమోదు కాగా ,ఈ కేసుల్లో ఎక్కువగా బొంరాస్‌పేట్, జింగుర్తి ఏరియాల్లో నమోదైనవే. అదే విధంగా డెంగ్యూ కేసులు మన జిల్లాలో మూడు నమో దయ్యాయి. ప్రతి ఒక్కరూ తమ పరిసరాల్లో దోమలు లేకుండా చూసు కోవా లి. పరిసరా ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

మురుగునీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. మురుగునీరు ఉన్న ప్రదేశాల్లో దోమలు ఎక్కువగా వృద్ది చెందుతాయి. దోమలు వృద్ధి చెందకుండా ప్రజలు తగిన నివారణ చర్యలు తీసుకుంటే చాలావరకు రోగాలకు దూరంగా ఉండవచ్చు.

కానరాని ప్రగతి జాడలు

- అభివృద్ధికి ఆమడ దూరంలో ఆమనగల్లు
- ప్రతి పాదనల్లోనే నిలిచిన అభివృద్ధి
- పరిష్కారానికి చొరవ చూపని నేతలు
- నేతల మధ్య సమన్వయ లోపం- ప్రజలకు శాపం


రోడ్లపైనే కూరగాయాల విక్రయాలు

ఆమనగల్లు: నాలుగు మండలాలకు కూడలిగా ఉండి, రాష్ట్ర రాజధానికి చేరువలో ఉన్న ఆమనగల్లు పట్టణం నేటికి ఆశించిన ప్రగతికి నోచుకోలేదు. ఏళ్ల కాలంగా సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నేతల మధ్య సమన్వయ లోపం, కొందరి స్వార్థం ప్రగతికి శాపంగా మారింది. కల్వకుర్తి నియోజకవర్గానికి కేంద్ర బిందువుగా ఉండి వేగంగా విస్తరిస్తున్న ఆమనగల్లు ప్రగతిలో మాత్రం పూర్తిగా వెనకబడింది. అధికారుల ఉదాసీన వైఖరి, ప్రజాప్రతినిధుల పట్టింపులేని ధోరణి వెరసి అనేక పనులు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. ఏళ్లుగా ఆయా సమస్యల పరిష్కారానికి, పలు అభివృద్ధి పనులకు స్థానికులు చేస్తున్న విన్నపాలకు మోక్షం లభించడం లేదు. ప్రజాప్రతినిదులు కొందరు తమ సొంత వ్యవహారాలపై చూపుతున్న శ్రద్ధ ప్రజా సమస్యల పరిష్కారంలో చూపడం లేదన్న విమర్శలున్నాయి.

తాగునీటి సమస్య

కాలమేదైన ఆమనగల్లు పట్టణంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. సగానికిపైగా కాలనీలలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. కొన్ని కాలనీలలో మహిళలు నెలల కాలంగా దాహర్తీ బాధలతో అల్లాడుతున్నారు. కృష్ణా తాగునీటి కేటాయింపులకు వాటర్ బోర్డు అధి కారులపై ఒత్తిడి తేవడంలోనూ ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. పక్షం రోజులకోసారి మహి ళలు తాగునీటి సమస్యల పరిష్కారానికి పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళనలు చేయడం పరిపాటిగా మారింది.


తాగునీటి కోసం మహిళల ఇక్కట్లు (ఫైల్)

అసంపూర్తిగా నిర్మాణాలు

ఆమనగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణం, వ్యవసాయ శాఖ కార్యాలయ అదనపు గది నిర్మాణం, షాదీఖానా నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. నాయకులు, ఉన్నతాధికారులు ఆయా సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రతిపాదనలకే పరిమితం

డిగ్రీ కళాశాల ఏర్పాటు, ప్రభుత్వ ఆసుపత్రి, బస్టాండ్ విస్తరణ, బీసీ బాలికల వసతి గృహం ఏర్పాటు, ఆదర్శ పాఠశాల, ఆర్‌అండ్‌బీ అతిథి గృహ నిర్మాణం, మండల పరిషత్ ఎదుట దుకాణ సముదాయ నిర్మాణం, హైదరాబాద్ ప్రధాన రహదారిపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు, బస్టాండ్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, ఎక్సైజ్ కార్యాలయానికి, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు సొంత భవనాల నిర్మాణం, మిని స్టేడియం ఏర్పాటు, రైతు బజార్ ఏర్పాటు వంటి అభివృద్ధి పనులు నేతల హామీలకు, అధికారుల ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. ఆమనగల్లు పట్టణంలో ఒక్క పార్కు కూడ లేదు.

రోడ్లపైనే విక్రయాలు


వారాంతపు సంతా, కూరగాయల, చేపల, మాంసం విక్రయాలకు పట్టణంలో నిర్ధిష్ట స్థలాలు లేవు. దీంతో గాంధీ చౌక్ నుంచి అంగడీ బజార్ వరకు రోడ్డుకిరువైపులా కూరగాయల విక్రయాలు సాగిస్తున్నారు. దీంతో ఇటు వ్యాపారులు, అటు కొనుగోలు దారులు ఏళ్ల కాలంగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారులు కూడా చాలా చోట్ల ఆక్రమణకు గురయ్యాయి. పట్టణంలో పార్కింగ్ స్థలాలు కూడ లేవు.

లోపించిన పారిశుధ్యం

ఆమనగల్లు పట్టణంలో పారిశుధ్యం పూర్తిగా లోపించింది. మురుగు కాల్వలు కొన్ని చోట్ల శుభ్రత లేక దుర్వాసన వెదజల్లుతున్నాయి. కొత్త కాలనీలలో మురుగు కాల్వలు లేక ఇళ్ల నుంచి వస్తున్న మురుగు నీరు. రోడ్లపైనే నిలుస్తుంది. దీంతో ఈగలు, దోమలు ముసురుతున్నాయి. అంతర్గ రోడ్లు కూడ కొన్ని చోట్ల అధ్వానంగా తయారయ్యాయి.

ఎవరు పట్టించుకోవడం లేదు

ఆమనగల్లు పట్టణ అభివృద్ధి, సమస్యల పరిష్కారం గురించి ఎవరు పట్టించుకోవడం లేదు. అనేక అభివృద్ధి పనులు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. సమస్యలతో ప్రజలు ఏళ్ల కాలంగా ఇబ్బందులు పడుతున్నారు. వేగంగా పట్టణం విస్తరిస్తున్న అందు కనుగుణంగా ప్రజలకు మౌలిక వసతులు ఒనగూడడం లేదు.



-బికుమాండ్ల యాదయ్య, టీడీపీ నాయకుడు

ప్రభుత్వానికి నివేదించాం

ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సొంత భవన నిర్మాణం గురించి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెస్తున్నాం. స్థలం కేటాయించి భవనం నిర్మించాలని జిల్లా కలెక్టర్‌కు నివేదించాం. సాంఘిక సంక్షే మ గురుకుల పాఠశాల సొంత భవన నిర్మాణానికి మంగళ పల్లి గేట్ సమీపంలో నాలుగు ఎకరాల భూమిని కేటాయించాం.



- తల్లోజు లలితవెంకటయ్య, ఎంపీపీ, ఆమనగల్లు

సమన్వయంతో కృషి చేయాలి

సమస్యల పరిష్కారానికి మండల ప్రజా ప్రతినిధులు, అన్ని పార్టీల నాయకులు సమ న్వయంతో ముందుకు సాగాలి. స్థలాలు కేటాయించి విద్యా సంస్థల, ఇతర అభివృద్ధి పనుల నిర్మాణాలు చేపట్టాలి. కృష్ణా తాగునీటి కేటాయింపులు పెంచి నీటి సమస్యను పరిష్కరించాలి. బస్టాండ్ విస్తరించి మెరుగైన సదుపాయాలు కల్పించాలి.



- పూసల సత్యం, జిల్లా ఉపాధ్యక్షుడు

మహిమాన్వితమైన శ్రీరామభద్ర క్షేత్రం

జిల్లా

శామీర్‌పేట రూరల్: భక్తులు కోరిన కోర్కెలు తీర్చుతు, రామ నామంతో మారుమ్రోగుతున్న ఈ రామభద్రక్షేత్రం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం పొతాయపల్లి గ్రామ సమీపంలో వెలిసియున్నది. శ్రీ శంకరా చారీట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీరామభద్ర క్షేత్రాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్మించారు. ఈ ఆలయం పూర్తిగా గందపు రాతితో శిలామయంగా 16 స్తంభాలతో అత్యంత సుందరంగా నిర్మించారు. ఈ ఆలయంలోని సుదర్శన చక్రం అత్యంత విశిష్టమైనది. ఈ ఆలయం ద్వీతీయ భద్రాద్రి క్షేత్రంగా ప్రసిద్ధి చెందుతుంది. ఈ ఆలయానికి తూర్పు బాగంలో ఆంజనేయ స్వామి ఆలయాన్ని అయోధ్యలో రామమందిర ప్రేరణతో ఇరవై_నాలుగు గంటల్లో నిర్మాణం పూర్తి చేశారు. ఈ ఆలయ నిర్మాణానికి పట్లూరి మాణిక్య సోమయాజులు, ఆయుత చండి యాగ నిర్వాహకులు అష్టకాల రామ్మోహన్‌శర్మ, సంస్కృత సోదరులు శ్రీనాద్‌శర్మ, మహదేవశర్మలు, భక్తులు, గ్రామస్థులు ఆరు నెలల వ్యవధిలోనే ఆలయ నిర్మాణాలను పూర్తి చేశారు. ఈ ఆలయంలోని ఉత్సవ విగ్రహలు భద్రాచలంలోని శ్రీరామభద్ర క్షేత్రం గర్భగుడిలో పూజలు చేసి ఈ ఆలయానికి తీసుకవచ్చామని ఆలయ ఫౌండర్ సంతోష్‌శర్మ తెలిపారు. ఈ ఆలయాన్ని శ్రీ శృంగేరి భారతీ తీర్దస్వామి దివ్య ఆశీస్సులతో మే 7న 2017లో ప్రతిష్ట కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.


కొలువైన సీతారామచంద్రస్వామి

ఉద్యోగపర్వం

కంట్రిబ్యూటరీ పింఛన్ విధానాన్ని రద్దు చేయాలి

- టీఎస్‌యూటీఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్

ఘట్‌కేసర్: కంట్రిబ్యూటరీ పింఛన్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్‌విధానాన్ని పునరుద్ధరించాలి. ఈ విషయమై ఈనెల 9, 10 తేదీలలో మండల స్థాయిలో నిరసన కార్యక్రమాలు చేపట్టాము. సెప్టెంబర్ 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సీపీఎస్ ఉపాధ్యాయ ఉద్యోగులందరు విధులకు సాముహిక సెలవులు పెట్టి నల్లబ్యాడ్జీలతో కలెక్టరేట్ల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నాం. సర్వీసు రూల్స్‌కు సంబందించి రాష్ట్రపతి స్థాయిలో సవరణ జరిగినందున రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నూతన సర్వీసు రూల్స్‌ను తయారు చేసి విద్యావ్యవస్థలో ఖాళీగా ఉన్న ఎంఈఓ, జేఎల్‌ఎస్ ఇతర ఫోస్టులను ప్రమోషన్లద్వారా పూర్తి చేయాలి.



విద్యుదాఘాతానికి రైతు మృతి



మృతి చెందిన రైతు అన్వర్

తలకొండపల్లి : వ్యవసాయ పొలం వద్ద ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతి చెందిన సంఘటన తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి... పడకల్ గ్రామానికి చెందిన ఎం.డి.అన్వర్(34) తనకున్న మూడెకరాల గైరాన్ భూమిలో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పొలంలో ఉన్న బోరుతో వరి పంట సాగుకు కరిగెట్లు సిద్ధం చేశారు. రోజు మాదిరిగా పొలం వద్దకు వెళ్లిన అన్వర్ పైపు గేటువాల్ తిప్పుతుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన చుట్టుపక్కల రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి వచ్చి చూడగా అప్పటికే అన్వర్ మృతి చెందాడు. మృతుడికి భార్య బిస్మిల్లా, ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు. సంఘటన స్థలాన్ని తలకొండపల్లి ఎస్ఐ సైదబాబు సందర్శించి మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన రైతు అన్వర్ కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఖానాపూర్‌లో ఎద్దు..



చేవెళ్ల రూరల్ : విద్యుదాఘాతానికి ఎద్దు మృతి చెందిన సంఘటన చేవెళ్ల మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన చిన్నపోసి పోచయ్య రోజు మాదిరిగానే పొలంలో రెండు ఎద్దులను మేతమేపుతున్నాడు. అయితే ఒక ఎద్దు మేత మేస్తూ విద్యుత్ స్తంభం సపోర్టువైర్‌కు తగిలింది దీంతో విద్యుత్‌షాక్ తగిలి పడిపోయింది. గమనించిన రైతు వెంటనే చుట్టుపక్కల రైతులను పిలిచి జరిగిన విషయం విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. దీంతో సిబ్బంది అక్కడికి చేరుకుని పరిశీలించగా విద్యుత్ స్తంభం సపోర్టువైర్‌కు షాక్ రావడంతోనే ఎద్దు మృతి చెందిందని గుర్తించారు. రూ.50వేల విలువైన ఎద్దు మృతి చెందడంతో రైతు బోరుమన్నాడు. విద్యుత్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వలనే ఎద్దు చనిపోయిందని రైతు వాపోయాడు. తనకు నష్టపరిహారం అందించాలని రైతుతోపాటు గ్రామస్థులు అధికారులను డిమాండ్ చేశారు.

అదుపుతప్పిన స్కూల్ బస్సు..

తృటిలో తప్పిన ప్రమాదం

ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం మండల పరిధి రాయపోల్ దగ్గర గురువారం ఉదయం శ్రీ చైతన్య టెక్నో స్కూల్ బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకుపోయింది. తృటిలో ప్రమాదం తప్పింది. బస్సులో 18మంది విద్యార్థులుండగా వీరంతా సురక్షితంగా ఉన్నారు. రోడ్డు విశాలంగా ఉన్నప్పటికీ రోడ్డు పక్కకు దూసుకుపోయిందంటే డ్రైవర్ అజాగ్రత్తేనని తెలుస్తోంది.



రోడ్డు పక్కకు దూసుకెళ్లిన బస్సు

'టాటా' ఉద్యోగుల రిమాండ్



ఆదిభట్ల : ఆదిభట్లలోని టాటా సంస్థకు చెందిన ఉద్యోగులు వారం రోజులుగా నిర్వహిస్తున్న బుధవారం కీలక మలుపు తిరిగింది. ముఖ్యంగా ఈ ఆందోళనకు నాయకత్వం వహిస్తున్న ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఆదిభట్ల సీఐ కథనం ప్రకారం ఆదిభట్ల ఐటీ జోన్ పరిధిలోని టాటా అడ్వాన్స్ సిస్టమ్స్ సంస్థ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వ్యక్తుల్లో సమీర్‌ముల్ల, మహేష్ కుమార్, బ్రహ్మావరపు రామాంజనేయులు, బికన్ సదానంద్, కొత్తగల్ల రాజ్‌కుమార్, సుచర్‌వట్టప్పస్వామి శివకుమార్‌లపై కేసు నమోదుచేసి రిమాండ్ చేశారు. 144 సెక్షన్ ఉల్లఘించడంతోపాటు సంస్థలోకి అక్రమంగా చొరబడినందుకు వీరిని రిమాండ్‌కు పంపామని పోలీసులు చెప్పారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం న్యాయపరంగా ఆందోళన చేస్తున్న ఉద్యోగులపై అక్రమంగా కేసులు నమోదు చేయడం సరైందికాదని వివిధ రాజకీయపక్షాల నాయకులు, కార్మిక సంఘాల నాయకులు ప్రభుత్వ విధానాలపై ఆగ్రహం చెందారు. రాష్ట్ర ప్రభుత్వం తగు మూల్యం చెల్లించుకోకతప్పదని డీసీసీ అధ్యక్షుడు క్యామ మల్లేష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి గోగిరెడ్డి లచ్చిరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొత్త అశోక్‌కుమార్ గౌడ్, సీఐటీయూ నాయకులు జగదీష్‌లు విమర్శించారు.

ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ఒమన్ బాధితులు

స్వాగతం పలికిన గల్ఫ్ అసోసియేషన్ సభ్యులు

శంషాబాద్ : ఒమన్‌లోని పెట్రోస్ గల్ఫ్ కంపెనీలో పనిచేయడానికి వెళ్లి తీవ్ర ఇబ్బందులకు గురైన ఐదుగురు బాధితులు బుధవారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. వారికి గల్ఫ్ అసోసియేషన్ సభ్యులు స్వాగతం పలికారు. అయితే ఆ కంపెనీలో పని చేయడానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 900 మంది మూడు నాలుగు నెలలుగా జీతాలు రాక, తిండిలేక అలమటించారని బాధితులు తెలిపారు. కార్మికుల నాలుగు నెలల జీతం గ్రాట్యుటీ కలిపి ఒక్కొక్కరికి మూడు నుంచి నాలుగు లక్షలు రావాల్సి ఉంది. వీరిలో ఐదుగురు వలస కార్మికులు వచ్చి చేతులతో ఇంటి దారి పట్టారు. వీరికి ఇండియన్ ఎంబసి ఉచితంగా విమాన టికెట్లు సమకూర్చారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన జెడల బాబయ్య, ఓ.భూమేష్, సీ.తులసీరావు, పురుషోత్తం, ఏపీకి చెందిన ఎం.



మాట్లాడుతున్న గల్ఫ్ అసోసియేషన్ సభ్యులు

గణేశ్‌లు ఒమన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానంలో ఎయిర్‌పోర్టుకు వచ్చారు. ఈ సందర్భంగా వాళ్లు మీడియాతో మాట్లాడుతూ... పదేళ్లుగా ఈ కంపెనీలో పనిచేస్తున్న కార్మికుల్లో మన రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఆ కంపెనీకి చెందిన వారి చేతిలో మోసాలకు గురై ఇంటిదారి పట్టారన్నారు. కొన్ని సంవత్సరాలుగా ఒకే కంపెనీలో పనిచేసిన వారికి లక్షలాది రూపాయల గ్రాట్యూటీ ఇవ్వాల్సి ఉండగా కంపెనీ యాజమాన్యం తప్పించుకునేందుకు కంపెనీలో పనిలేదంటూ మూడు నాలుగు మాసాలుగా వేతనాలు నిలిపివేసిందన్నారు. కంపెనీ యాజమాన్యం మొండికేయడంతో గత్యంతరం లేని కార్మికులు ఒమన్‌లోని లేబర్ కోర్టులో కేసు వేశారు. తుది తీర్పు వచ్చేవరకు చాలాకాలం పట్టే అవకాశం ఉండటంతో గత్యంతరం లేక ఇండియన్ ఎంబసీ ఫవర్‌హాఫ్ అటార్ని హక్కులు కల్పించి స్వదేశానికి వచ్చినట్టు తెలిపారు. తెలంగాణకు చెందిన 200మంది కార్మికుల కంటే ఎక్కువగానే ఉన్నారని తెలిపారు.

ప్రభుత్వం కార్మికులకు ఉపాధి కల్పించాలి

ఒమన్ కంపెనీ చేతిలో మోసపోయి స్వదేశానికి వచ్చిన బాధిత కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం ఉపాధి కల్పించి వారి కుటుంబాలు రోడ్డున పడకుండా చూడాలని తెలంగాణ గల్ఫ్ వర్కర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎన్.దేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

విద్యార్థినులకు అసభ్యకర మెసేజ్‌లు

- షీ టీం మహిళా కానిస్టేబుల్‌కు తప్పని వేధింపులు
- నిర్భయ చట్టం కింద కేసులు.. యువకుడికి రిమాండ్

ఇబ్రహీంపట్నం : విద్యార్థినిలకు సెల్‌ఫోన్ ద్వారా అసభ్యకరంగా మెసేజ్‌లు పంపుతూ, వారి ఫొటోలు, సెల్ నెంబర్లు పెట్టి వేధిస్తున్న ఓ యువకుడిపై ఇబ్రహీంపట్నం పోలీసులు నిర్భయ చట్టం కింద కేసులు నమోదుచేసి గురువారం రిమాండ్‌కు పంపారు. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ ఎస్.మల్లారెడ్డి వివరాలు వెల్లడించారు. వరంగల్ జిల్లా పరకాలకు చెందిన భైరం నిఖిల్‌కుమార్(24) పదో తరగతి వరకు చదివి కొంతకాలం సెక్యూరిటీ గార్డుగా పనిచేసి జులాయిగా తిరుగుతున్నాడు. ఇబ్రహీంపట్నంలోని ఓ డిగ్రీ కళాశాలలో చదివే విద్యార్థినికి సెల్‌ఫోన్ ద్వారా తరచూ అసభ్యకరమైన మెసేజ్‌లు పంపుతున్నాడు. అంతేగాక ఫేస్‌బుక్ నుంచి మరికొందరి విద్యార్థినిల ఫొటోలు తీసుకుని వారి సెల్ నెంబర్లు అశ్లీల వెబ్‌సైట్ పెట్టి ఇతరులకు పంపుతున్నాడు. దీంతో ఓ విద్యార్థిని షీ టీంకు సమాచారం ఇచ్చింది. రాచకొండ షీ టీం మహిళా కానిస్టేబుల్ అతడికి ఫోన్‌చేసి వివరాలు రాబట్టే ప్రయత్నంలో ఉండగా అతడు అసభ్యకరమైన మెసేజ్‌లతో ఆమెను కూడా వేధించడం మొదలు పెట్టాడు. తరచూ సెల్‌ఫోన్లు, ఫోన్ నెంబర్లను మార్చుతూ అతను ఈ వ్యవహారానికి ఒడిగడుతున్నాడు. అంతేగాక ఆమె నంబరును కూడా అశ్లీల వెబ్‌సైట్ పెట్టాడు. దీంతో ఆమెకు ఇతరుల నుంచి ఫోన్లు రావడంతో ఆమె ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ కేసును తీవ్రంగా పరిగణించిన పోలీసులు ఎట్టకేలకు అతన్ని పట్టుకుని విచారించారు. అతని నుంచి రెండు సెల్‌ఫోన్లు, సిమ్‌కార్డులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై నిర్భయ చట్టం కింద కేసులు నమోదుచేసి రిమాండ్‌కు పంపారు. సమావేశంలో సీఐ వాసం స్వామి, ఎస్ఐలు గోపాల్, విజయ్‌లు ఉన్నారు.

ఉరేసుకుని వివాహిత మృతి

షాబాద్ : ఉరేసుకుని వివాహిత మహిళ మృతి చెందింది. షాబాద్ మండలం పెదవీడు గ్రామానికి చెందిన నవనీత(27)ను శంషాబాద్ మండలం చౌదరిగూడ గ్రామానికి చెందిన ముచ్చింతల నరేష్‌కి ఇచ్చి వివాహం చేశారు. వివాహం తదనంతరం కొన్నాళ్లు వారి సంసారం సాఫీగానే జరిగింది. కాగా కుటుంబ పోషణ భారమవడంతో సంవత్సరం క్రితం భార్యాభర్తలు వారి కుమారుడు కలిసి తల్లిగారి గ్రామమైన పెదవీడుకు వచ్చారు. అన్న యాదయ్యతో పాటుగా అదే ఇంట్లో ఉండేవారు. మంగళవారం నవనీత భర్త నరేష్ స్వగ్రామానికి వెళ్లి వస్తానని చెప్పడంతో వెళ్లవద్దని నవనీత వారించింది. ఇద్దరి



మధ్య గొడవ జరగ్గా మనస్థాపంతో ఇంట్లో ఉరేసుకుని మృతి చెందింది. నవనీత అన్న యాదయ్య బుధవారం ఎస్ఐ రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లోక్‌సత్తా రాష్ట్ర కార్యవర్గ, జిల్లా అధ్యక్షుల ప్రకటన

కొత్తపేట : లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు నందిపేట రవీందర్ రాష్ట్ర కార్యవర్గాన్ని, జిల్లా అధ్యక్షులను ప్రకటించారు. కొత్తపేటలోని లోక్‌సత్తా కార్యాలయంలో బుధారం ఆయన పార్టీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం, ఉపాధి అంశాలపై ప్రజల్లో చైతన్యం తీసుకువస్తామన్నారు. పార్టీ మాజీ అధ్యక్షులు పాండురంగారావును జాతీయ కమిటీకి సిఫారసు చేశామని తెలిపారు. అనంతరం ఆయన నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా అల్లేని నిఖిల్, ఉపాధ్యక్షులుగా పూడూరి శ్రీనివాసరావు, కార్యదర్శిగా ఏ.జయంత్‌రావు అధికార ప్రతినిధులుగా జిన్నేపల్లి శ్రీనివాసరెడ్డి, బాలస్వామిలు నియమితులయ్యారు. అదే విధంగా 16 జిల్లాల అధ్యక్షుల జాబితాను ఆయన ప్రకటించారు. సిద్దిపేట-డీ.రాజు, కరీంపగర్-వంశీ, కొత్తగూడెం-ప్రవణ్, సూర్యాపేట-నాగరాజు, నల్గొండ-ప్రతాప్, వరంగల్ అర్బన్-జగదీశ్వర్‌రావు, జోగులాంబ గద్వాల-వీరేష్, వనపర్తి-రామచంద్రుడు, యాదాద్రి- కే.మల్లేశం, గ్రేటర్ హైదరాబాద్-దోసపాటి రాము, జగిత్యాల-సుగుణాకర్, పెద్దపల్లి-సతీష్, కామారెడ్డి-తాహిర్, నిజామాబాద్-దొడ్ల శేఖర్, సంగారెడ్డి-నిజాముద్దీన్, మేడ్చల్-నవీన్‌కుమార్‌లు అధ్యక్షులుగా నియమితులయ్యారు.

'ఉపాధి మేట్ల సమస్యలు పరిష్కరించాలి'

చేవెళ్ల రూరల్ : ఉపాధి మేట్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జగన్, సీఐటీయూ జిల్లా నాయకులు అశోక్ లు తెలిపారు. వారు బుధవారం చేవెళ్లలో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో క్షేత్రసాయిలో పని చేస్తున్న ఉపాధి మేట్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరం చూపాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీ వెంట ఉండి పనులు చేయిస్తున్న మేట్లకు ప్రభుత్వం వేతనం అందించాలన్నారు. సీనియర్ మేట్లను ఫీల్డ్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించాలన్నారు. మేట్లకు మెడికల్ కిట్స్, టేపు, సైకిల్‌తోపాటు సెల్‌ఫోన్ ఉచితంగా అందజేయాలని స్పష్టం చేశారు. లేనిచో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠాపన

● హాజరైన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మాజీ హోంమంత్రి

చేవెళ్ల రూరల్: చేవెళ్ల మండల పరిధిలోని పలుగుట్ట గ్రామంలో శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో గణపతి, శివుడు, సుబ్రహ్మణ్యస్వామి, నవగ్రహలు, నాగదేవత, ధ్వజస్తంభం, దీపస్తంభం, బొడ్డురాయి, పంచాయతన తదితర విగ్రాహన ప్రతిష్ఠాపన కార్యక్రమాలు గత మూడు రోజులుగా గ్రామంలో అద్యంతం భక్తిభవంతో కొనసాగించారు. అయితే బుధవారం ముగింపు కార్యక్రమంలో కావడంతో గ్రామంలో హోంమాలు నిర్వహించారు. శివాలయం ముందు కర్రధ్వజ సంబం, హనుమన్‌దేవాలయం ముందు రాతి ధ్వజస్తంభం వెర్వురుగా ప్రతిష్ఠాపన వేద మాంత్రాల మధ్య నెలకొల్పారు. దీంతో గ్రామంలో పూర్తిగా పండుగా వాతవరణం నెలకొన్నది. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలెయాదయ్య, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ హోంమంత్రి సబితారెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు పడాల వెం కట్‌స్వామి, మాజీ ఎంపీపీ, కె. రాజ్యలక్ష్మీప్రకాశ్‌గౌడ్ లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయం కమిటీ సభ్యులు, గ్రామస్తులు వారిని ఘనంగా సన్మానించి, తీర్థప్రసాదలు అందజేశారు. అనంతరం గ్రామంలో భక్తులందరికీ పెద్దఎత్తున్న అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్ చాంబర్స్ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, సర్పంచ్ ప్రభవతి, కాం గ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జనార్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి పలుగుట్ట శ్రీనివాస్‌గౌడ్, సీనియర్ నాయకులు మాల్లారెడ్డి (శేఖర్‌రెడ్డి), మాజీ సర్పంచ్ నర్సింలు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, జంగయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి, దేవాలయం కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్తులు, మహిళలు, యువకులు తదితరులు ఉన్నారు.


పూజల అనంతరం ఆలయంలో మాజీ హోంమంత్రి సబితారెడ్డి


ఆలయంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డిని సన్మానిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

వర్షాల కోసం కప్పకావడి


కప్పతో ఊరేగిస్తున్న గ్రామస్థులు

షాబాద్ : వర్షాకాలం ప్రారంభం అయిన సగం కాలం అవుతున్న వర్షాలు కురువకపోవాడంతో గ్రామాల్లో కప్పకావడి ఆడుతూ వర్షాలు కురువాలి స్వామి అంటూ కప్పను గ్రామ పురవీధు ల్లో తింపుతూ దేవుని కొలుస్తున్నారు. బుధవారం మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు కప్పను రోకలికి కట్టుకొని గ్రామ పుర వీదుల్లో తిరుగుతూ వర్షాలు బాగా కురు వాలని ఆటలు, పాటలు పడుతూ తిరిగారు. అనంతరం హనుమాన్ దేవాలయంలో వర్షాలు కురువాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

'మొక్కలు నాటి సంరక్షించుకోవాలి'


మొక్కను నాటుతున్న టీఆర్ఎస్ నాయకుడు

చేవెళ్ల రూరల్ : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలని టీఆర్ఎస్ జిల్లా యుత్ నాయకులు వనం లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. బుధ్వారం మండల పరిధిలోని ఎన్కెపల్లి, ఈర్లపల్లి గ్రామాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామల్లో ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటుకొనేందుకు ప్రజలు మరింత ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు జనార్ధన్, ఉపాధ్యక్షుడు కాటం రాజేందర్ గౌడ్, విక్రమ్‌గౌడ్, యుత్‌నాయకులు సుగుణాకర్, పోచయ్య, మహేందర్, ప్రశాంత్ ఉన్నారు.

మీజిల్స్, రూబెల్లా టీకా తప్పకుండా వేయించాలి

● ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ స్రవంతి

షాబాద్: మీజిల్స్, రూబెల్లా టీకాను పిల్లలకు తప్పకుండా వేయించాలని షాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ స్రవంతి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ర్యాలీని ఆశవర్కర్లతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలియో మాదిరిగానే ప్రాణాంతకమైన మీజిల్స్, రూబెల్లా వ్యాధిని దేశం నుంచి పారదోలేందుకు కేంద్ర ప్రభు త్వం ఎంఆర్ టీకాను ఆవిష్కరించిందన్నారు. షాబాద్ పీహెచ్‌సీ పరిధిలో 33 పాఠశాలల్లో 7340 మంది విద్యార్థులకు ఈ వ్యాక్సిన్ వేయనున్నట్లు తెలిపారు. ఈ వ్యాధి ద్వారా 5 సంవత్సరాల లోపు పిల్లలకు ఇది ప్రాణాంతకరమ్మైన వ్యాధి దీని వలన పిల్లలు ఎక్కువగా చనిపోతున్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలన్నారు.

విద్యార్థుల ర్యాలీ

చేవెళ్ల రూరల్: తట్టు రూబెల్లా వ్యాధులను తరిమి కొట్టేందుకు ప్రజలందరు భాగస్వాములు కావాలని వైద్య సిబ్బంది తెలిపారు. బుధవారం మండల పరిధిలోని ఈర్లపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. తట్టు, రూబెల్లా వ్యాధులకు సంబంధించి ఈనెల 17 నుంచి గ్రామాల్లోని పిల్లలకు ఉచితంగా ప్రభుత్వం టీకాలు వేస్తుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న ఆశవర్కర్లు

20న రక్తదానం శిబిరం

చేవెళ్ల రూరల్ : ఈనెల 20వ తేదిన చేవెళ్ల మండల కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహించడం జరుగుతుందని పర్యావరణ అవార్డు గ్రహీత రామకృష్ణరావు, యువ నాయకులు గణపతి చంద్రశేఖర్‌రెడ్డి (రాజు) తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ మండల కేంద్రంలోని కెజీఆర్ గార్డెన్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రక్తదాన శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు.

నేడు బీజేవైఎం నాయకుల సమావేశం

చేవెళ్ల రూరల్ : ఈనెల 17న చేవెళ్ల మండల కేంద్రంలో జిల్లా బీజేవైఎం నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించడం జరుగుతుందని యువమోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, జిల్లా కార్యదర్శిశ్రీధర్ రెడ్డిలు తెలిపారు. జిల్లాలోని నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

'తాగునీటి సమస్య లేకుండా చూస్తాం'

షాబాద్: గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చూస్తామని దామర్లపల్లి సర్పంచ్ బర్ల పోచమ్మ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని దామర్లపల్లి గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన పేదవేడు గ్రామంలో తాగునీటి సమస్యలేకుండా నూతన బోరును ప్రారంభించారు. గ్రామంలోని మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బుచమ్మ, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి 50 వేలు అందజేత

చేవెళ్ల రూరల్: ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి పర్చిందుకు దాతలు ముందుకురావడం చాలా సంతోషకరమని కమ్మెట సర్పంచ్ హన్మంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని కమ్మెట ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ఆ గ్రామం సమీపంలో ఉన్న కోళ్ల ఫా రం యాజామని రవికపూర్ ఉచితంగా రూ.50 వేలు అందజేశారు. ఎంపీటీసీ నర్సిహ్మరెడ్డి, వార్డుమెంబర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు సురేందర్ గౌడ్, మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మాదవ్‌గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లయ్య ఉన్నారు.

'యువత గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి'

మొయినాబాద్: యువకులు గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు పుల్లగొల్ల మల్లేష్ యాదవ్ అన్నారు. మండలంలోని హిమాయత్‌నగర్‌లో శాంతి యువజన సంఘం సమావేశం నిర్వమహించి నూతన కమిటీని ఎంపిక చేశారు. హిమాయత్‌నగర్ శాంతి యువజన సంఘం ఎన్నికలు గ్రామ సర్పంచ్ పి.మల్లేష్‌యాదవ్, మాజీ ఎంపీటీసీ కుమ్మరి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. హిమాయత్‌నగర్ శాంతియువజన సంఘం నూతన అధ్యక్షుడిగా దేవుల పల్లి నవీన్‌గౌడ్, ఉపాధ్యక్షునిగా బుర్రకాయల మహేందర్ ముదిరాజ్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా కుమ్మరి వినోద్, ఆర్గనైజర్‌గా అశోక్‌చారి, క్రీడల ఆర్గనైజర్‌గా సాయినాథ్, కోశాధికారిగా సురేష్, గుండు కుమార్‌లు ఎన్నికయ్యారు.

'డాక్ సేవకుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి'


నిరసన తెలుపుతున్న డాక్ సేవకులు

మొయినాబాద్: పోస్టాఫీసుల్లో పనిచేసే గ్రామీణ డాక్ సేవకుల వెంటనే పరిష్కరించాలని గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ నాయకులు మల్లారెడ్డి అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం మండల కేంద్రంలోని పోస్టాఫీసు వద్ద గ్రామీణ డాక్ సేవకులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ డాక్ సేవకులకు 8 గంటల పనిదినాలు అమలు చేయడంతో పాటు కనీస వేతనాలు అమలు చేయాలని అన్నారు. డాక్ సేవకులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో డాక్ సేవకులు మహిపాల్‌రెడ్డి, సుధర్శన్‌రెడ్డి, శ్రీనివాస్, రవిందర్‌రెడ్డి, ప్రశాంతి, దశరథ్, ప్రవీణ, శంకరయ్యలు ఉన్నారు.

'మద్దూరులో ఇళ్ల స్థలాలను కేటాయించాలి'


తహసీల్దార్ అజీజ్‌కు వినతి పత్రం అందజేస్తున్న తండావాసులు

షాబాద్: మద్దూరు గ్రామంలోని 303 సర్వే నంబర్‌లో ఇళ్ల స్థలాలకు కేటాయించాలని మద్దూరు హన్మనాయక్ తండా వాసులు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అజీజ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా హన్మనాయక్ తండా వాసులు మాట్లాడుతూ మద్దూర్ రెవెన్యూలోని 303 సర్వేనంబర్‌లో గల 4ఎకరాల ప్రభుత్వ భూమిని ఇళ్ల స్థలాలకు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

నల్లరాళ్ల తండాలో ఆంజనేయ స్వామి బుధవారం విగ్రహ ప్రతిష్ట అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తల్లోజు ఆచారి, జడ్పీటిసి నర్సింహలు హా జరయ్యారు. నాయకులు పాండు, కుమార్, పాండు, శ్రీకాంత్, గెల్వయ్య, నరేశ్, మహేశ్, జగదీశ్, శంకర్, సురేశ్, శ్రీశైలం, నర్సింహ పాల్గొన్నారు. - (తలకొండపల్లి)



విద్యుత్ సమస్యలకు సత్వర పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న డీఈ హన్మంత్‌రెడ్డి

అధికారులు సిబ్బంది అంకితభావంతో పని చేయాలి : డీఈ హన్మంత్‌రెడ్డి

ఆమనగల్లు : విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది వినియోగదారులు, రైతులకు అందుబాటులో ఉండి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని కందుకూరు విద్యుత్ శాఖ డీఈ హన్మంత్‌రెడ్డి కోరారు. బిల్లుల వసూళ్ల లక్ష్యాల పూర్తికి కృషి చేసి సంస్థ అభివృద్ధికి పాటు పడాలని ఆయన సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని ఏడీఈ కార్యాలయంలో బుధవారం ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి మండలాల విద్యుత్ అధికారులు, సిబ్బంది సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమనగల్లు ఏడీఈ రవీందర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి డీఈ హన్మంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సబ్ డివిజన్ పరిధిలోని ఆయా మండలాల్లో విద్యుత్ బకాయిలు, సమస్యలు, ప్రమాదాల నివారణపై సమావేశంలో చర్చించారు. హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ మెరుగైన విద్యుత్ సరఫరా చేసి విద్యుత్ అధికారులు, సిబ్బంది ప్రజాభిమానాన్ని చూరగొనాలన్నారు. ప్రమాదాలకు చోటు లేకుండా ఎప్పటి కప్పుడు తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తెలిపారు. బిల్లుల వసూళ్లలో అలసత్వానికి చోటివ్వరాదన్నారు. విద్యుత్ సమస్యలకు సంబంధించి వచ్చే ఫిర్యాదులు, వినతులపై ఎప్పటికప్పుడు స్పందించాలని డీఈ ఆదేశించారు. ఏడీఈ రవీందర్, ఏఈలు రమేశ్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, రాజశేఖర్, నాలుగు మండలాల సిబ్బంది పాల్గొన్నారు.

మూఢాచారాలను పారద్రోలాలి : ఎస్ఐ



మాట్లాడుతున్న సంస్థ నిర్వాహకుడు హుమ్లాగురు

మాడ్గుల : సమాజంలో దృఢంగా నాటుకుపోయిన మూఢాచారాలు, సామాజిక రుగ్మతలను రూపు మాపడానికి విద్యావంతులు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు కృషి చేయాలని మాడ్గుల ఎస్ఐ గిరీశ్‌కుమార్ కోరారు. అవిద్యే మూఢాచారాలకు కారణమని ఆయన పేర్కొన్నారు. మాడ్గుల మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం రాత్రి జయహో ఇండియా ఆధ్వర్యంలో లీడ్ వరల్డ్ ఫౌండేషన్ నిర్వాహకుడు హుమ్లా గురు ఆధ్వర్యంలో మూఢనమ్మకాలు, గ్రామాభివృద్ధి అవగాహన సదస్సు నిర్వహించారు. .హుమ్లా గురు ఈ సందర్భంగా ప్రొజెక్టర్ ద్వారా మూఢనమ్మకాల వలన కలిగే అనర్థాలపై ప్రదర్శన ఇచ్చి ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామ నాయకులు, యువజన సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలు పూర్తి చేయాలి : ఏపీడీ

మాడ్గుల : హరితహారం లక్ష్యాల పూర్తికి అందరూ చొరవ తీసుకోవాలని ఏపీడీ ఉమాదేవి కోరారు. మాడ్గుల మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఈజీఎస్ అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బందితో హరితహారంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో ఫారుక్ హుస్సేన్, ఏపీవో నర్సింగ్, టెక్నికల్ అసిస్టెం ట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు ఉన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

మక్తమాదారానికి చెందిన మహేశ్‌కు సీఎం సహాయ నిధి రూ.8 వేలు మంజూరయ్యాయి. బుధవారం కడ్తాలలో ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి చెక్కును అందజేశారు. మాదారం సర్పంచ్ నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్, లక్ష్మయ్య, నాయకులు బాల్‌రాజ్, చెన్నయ్య, యూసూబ్, రాములు పాల్గొన్నారు. - (కడ్తాల్)

నేటి నుంచి చిన్నారులకు టీకాలు

- సెప్టెంబర్ 25 వరకు కార్యక్రమం కొనసాగింపు
- 23 వేల మంది బాలబాలికల గుర్తింపు
- టీకాల పంపిణీకి 15 టీంల ఏర్పాటు

ఆమనగల్లు : మీజిల్స్, రూబెల్లా వ్యాధి నిరోధక టీకాల పంపిణీ కార్యక్రమానికి ఆమనగల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం నుంచి ప్రారంభమయ్యే టీకాల కార్యక్రమం సెప్టెంబర్ 23 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం మీజిల్స్, రూబెల్లా వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం ఏర్పాట్లను డాక్టర్ వెంకటేశ్వర్లు వివరించారు. మండలంలో టీకాల పంపిణీకి 20 రోజులు కార్యాచరణ రూపొందించినట్లు వెల్లడించారు. ఆమనగల్లు ఉమ్మడి మండల పరిధిలోని 18గ్రామ పంచాయతీల పరిధిలో గల 100 పాఠశాలలు, 86 అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామాలలో 23 వేల మంది 9నెలల నుంచి 15 ఏళ్లలోపు బాలబాలికలు ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. ఈ మేరకు లక్ష్యసాధనకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. నిర్ణిత తేదిల వారిగా పాఠశాలలు,అంగన్‌వాడీ కేంద్రాలలో టీకాలు వేయడానికి ఆసుపత్రి పరిధిలో 15 టీంలు ఏర్పాటు చేసినట్లు డాక్టర్ వెంకటేశ్వర్లు వివరించారు. ప్రతి టీంలో నలుగురు సభ్యులు ఉంటారని, ఒక్కొక్క టీం రోజుకు 200 మంది విద్యార్థుల చొప్పున 15 టీంలు ప్రతి నిత్యం 3 వేల మంది బాలబాలికలకు టీకాలు వేయడం జరుగుతుందన్నారు. ఆమనగల్లు పట్టణంలో గురువారం ఆరు పాఠశాలల్లో మీజిల్స్, రెబుల్లా టీకాల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు వెంకటేశ్వర్లు తెలిపారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.

మీజిల్స్, రూబెల్లా టీకాలపై అవగాహన ర్యాలీ

కడ్తాల్ : మీజిల్స్, రెబుల్లా వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంపై లయన్స్‌క్లబ్ ఆద్వర్యంలో బుధవారం కడ్తాల మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ జి.చెన్నకిషన్‌రెడ్డి ర్యాలీని ప్రారంభించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, లయన్స్ క్లబ్ సభ్యులు ప్రధాన రహదారుల మీదుగా ర్యాలీ కొనసాగించారు. 9 నెలల నుండి 15 ఏళ్ల వయస్సు కలిగిన పిల్లలందరికి టీకాలు ఇప్పించి వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలన్నారు. ర్యాలీలో సర్పంచ్ వేణుగోపాల్, లియో క్లబ్ అధ్యక్షుడు రాజేందర్, జిల్లా గిరిజన సేవా సంఘం కన్వీనర్ హన్మ నాయక్, నాయకులు చందోజి, యాదయ్య, ఉపాధ్యాయులు, శ్రీనివాసాచారి, లక్ష్మారెడ్డి, పర్వత్‌రెడ్డి, నరోత్తమ్‌రెడ్డి, సువర్ణగోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బోనాల పండుగ



ఎక్వాయిపల్లి, ముద్విన్ గ్రామాలలో బుధవారం బోనాల పండుగను ప్రజలు అత్యంత భక్తి శ్రదలతో ఘనంగా జరుపుకున్నారు. మహిళలు బోనం కుండలను అలంకరించుకొని ర్యాలీగా గ్రామ దేవతల ఆలయాలకు చేరుకొని నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎక్వాయిపల్లిలో జరిగిన బోనాల వేడుకలకు మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్, ముద్విన్ లో జరిగిన బోనాల వేడుకలకు ఎమ్మెల్యే చల్లా వంశీచంద్ రెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆయా చోట్ల జరిగిన కార్యక్రమాలలో సింగిల్ విండో చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్, మాజీ ఎంపిపి పాలకుర్ల బుగ్గయ్య గౌడ్, మాజీ వైస్ ఎంపిపి జోగు వీరయ్య, సర్పంచ్‌లు వెంకటయ్య, యాదయ్య, ఎంపిటిసిలు, పార్వతమ్మ, యాదయ్య, వివిద పార్టీల, కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు. - (కడ్తాల్)

విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీఎస్‌యూ నాయకులు

ఆమనగల్లు : రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేస్తూ విద్యార్థుల సమస్యలు పట్టించుకోవడం లేదని తెలంగాణ విద్యార్థి యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కట్ట జంగయ్య ఆరోపించారు. పట్టణంలోని కళ్యాని గార్డెన్‌లో తెలంగాణ స్టూడెంట్ యూనియన్ ఆద్వర్యంలో ఈనెల 21న నిర్వహించే విద్యార్థి పోరుగర్జన సభకు సంబంధించి రూపొందించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను బుధవారం నాయకులతో కలిసి జంగయ్య ఆవిష్కరించారు. తెలంగాణ ఇంటి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చెరుకు సుధాకర్, ఉపాధ్యక్షుడు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ప్రజాగాయని విమలక్క, ఓయూ ప్రొఫెసర్ ఖాసీం, బహుజన నాయకుడు ఏపూరి సోమన్న, టీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ యాదిగలు హాజరవుతున్నట్లు వెల్లడించారు.

పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి : రవీందర్‌గౌడ్

ఆమనగల్లు: అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం పరితపించిన బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్లి మండల గౌడ సంఘం అధ్యక్షుడు రవీందర్‌గౌడ్ కోరారు. పాపన్నగౌడ్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ప్రతిష్టించాలని డిమాండ్ చేశారు. పట్టణంలో బుధవారం ఆయన మాట్లాడుతూ పాపన్న పోరాట పటిమను ప్రభుత్వం గుర్తించి ఈనెల 18న ఆయన జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించేలా ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. సంఘం నాయకులు అల్లాజిగౌడ్, పల్లె నారాయణగౌడ్, యాదయ్య గౌడ్, పంచాక్షరిగౌడ్, కుమార్ గౌడ్, లక్ష్మయ్యగౌడ్, వెంకటయ్యగౌడ్, గజ్జె యాదయ్య గౌడ్, గజ్జె శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు.

బలవంతపు చందాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు



ఎస్ఐ రామలింగారెడ్డి

ఆమనగల్లు: గణేశ్ ఉత్సవాల నిర్వాహణ పేరుతో బలవంతపు చందాల వసూళ్ళకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని ఆమనగల్లు ఎస్ఐ ఎల్లపురెడ్డి రామలింగారెడ్డి హెచ్చరించారు. భక్తితో ఎవరైనా చందాలు ఇస్తే స్వీకరించాలే గాని ఉత్సవాల పేరుతో ప్రజలు, వ్యాపారులు, ఉద్యోగులను బలవంతం చేసిన వారిని ఉపేక్షించేది లేదన్నారు. బెదిరింపులతో ఎక్కడైనా, ఎవ్వరైనా వినాయకచవితి చందాలు వసూలు చేసినట్లయితే పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. గణేష్ నవరాత్రోత్సవాల ఏర్పాటుకు ఉత్సవకమిటీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలను బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రామలింగారెడ్డి వివరించారు. ఈనెల 25నుండి ప్రారంభమయ్యే గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించడానికి ఉత్సవ కమిటీలు, స్థానికులు పోలీసులకు సహహకరించాలన్నారు. నిబంధనల మేరకు ఉత్సవ కమిటీలు నడుచుకోవాలని సూచించారు. వినాయక విగ్రహాలను ప్రతిష్టించే ఉత్సవ కమిటీలు, యువజన సంఘాలు, కాలనీవాసులు మండపాల ఏర్పాటుకు పోలీస్‌స్టేషన్లో నమోదు చేయించుకొని అనుమతి తీసుకోవాలి. మండపాల వద్ద డిజెలకు అనుమతి లేదని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు ఉంటాయన్నారు. మండపాల వద్ద మైకులకు ఏసిపి నుండి విధిగా అనుమతి పొందాలని, ఉదయం ఆరుగంటల నుండి రాత్రి పది గంటల వరకు పరిస్థితులను బట్టి అనుమతివ్వడం జరుగుతుందని ఎస్.ఐ పేర్కొన్నారు. ఉత్సవాల ప్రారంభం మొదలు నిమజ్జనం జరిగే వరకు ఉత్సవ కమిటీలు మండపాల వద్ద నిఘా ఏర్పాటు చేసుకో వాలన్నారు. ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా ప్రజాప్రతినిధులు, ఉత్సవ కమిటీలు సహకరించాలని కోరారు.

కాంగ్రెస్‌కు రావిచేడ్ ఎంపీటీసీ వసంత రాజీనామా



వసంత

కడ్తాల్ : మండల పరిధిలోని రావిచేడ్ గ్రామ ఎంపిటిసి సభ్యురాలు వసంత బుధవారం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడికి అందజేసినట్లు పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఎంపిటిసి వసంత విలేకరులతో మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో తనను సొంత కాంగ్రెస్ పార్టీ వారే అవమానించారని గిరిజన మహిళా ఎంపిటిసి అని చూడకుండా తన ప్రసంగాన్ని అడ్డుకొని మైకును లాగేసుకున్నారని ఆమె విచారం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ తరపున ఎంపిటిసిగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎమ్మెల్యే చల్లా వంశీచంద్ రెడ్డి గ్రామాభివృద్ధి గురించి తనకు ఏనాడు సహకరించలేదని ఆమె వాపోయారు. ఎమ్మెల్యేనే విమర్శిస్తావా అంటూ కొందరు నేతలు తనపై దాడికి పాల్పడ్డారని దీంతో మనస్థాపం చెంది కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

'దేవాలయ భూములు లాక్కుంటే ఊరుకునేదిలేదు'

యాచారం : దేవాలయ భూములనుంచి బలవంతంగా రైతులను వెళ్లగొట్టి ఫార్మాకంపెనీ కోసం ఇస్తే చూస్తూ ఊరుకునేదిలేదని రాష్ట్ర సీపీఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం యాచారంలో ఓ వివాహానికి హాజరై ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. దేవాలయ భూములను సాగుచేసుకుంటున్న రైతుల పేర్లను కాస్తు కాలంలో ఎందుకు రాయడం లేదో రెవెన్యూ అధికారులు వాస్తవాలు వెల్లడించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. దీనిపై తమ పార్టీ ఆందోళనకు దిగుతుందన్నారు.

అట్టడుగు వర్గాలకు అభివృద్ధి ఫలాలు

గుడుంబా రహిత తండాలు..
అభివృద్ధికి అంకురార్పణ
ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే
మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

గుడుంబా ప్రభావిత
కుటుంబాలకు పునరావాస
పథకం చెక్కుల పంపిణీ..


గుడుంబా ప్రభావిత కుటుంబాల పునరావాస పథకం కింద పీ.సీతండాలో లబ్ధిదారులకు గేదెల యూనిట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

మంచాల : అట్టడుగువర్గాలకు అభివృద్ధి ఫలాలు అందించాలన్నదే టీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష్యమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. గుడుంబా ప్రభావిత కుటుంబాలకు పునరావాస పథకం కింద పీ.సీ.తండా, బుగ్గతండాల్లో బుధవారం లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 2 లక్షల రూ.ల గొర్రెలు, గేదెల యూనిట్లను పంపిణీ చేశారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో షాదీ ముబారక్ లబ్ధిదారులకు 75 వేల రూ.ల చొప్పున చెక్కులు అందజేశారు. ఇంకా ఇటీవల రంగాపూర్‌లో ఆత్మహత్య చేసుకున్న మోహనాచారి, సరిత దంపతుల కుటుంబానికి రూ.6 లక్షల ఆర్థికసాయం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ బంగారు తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని కొనియాడారు. ఎవరూ ఊహించని పథకాలను అమలుచేస్తూ నిరుపేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని చెప్పారు. గుడుంబాను నిషేధించడమేగాకుండా ప్రభావిత కుటుంబాలకు పునరావాసం కల్పించడం అనేది చారిత్రక నిర్ణయమని కొనియాడారు. ఇక అన్నదాతలెవరూ ఆత్మహత్యలు చేసుకోవద్దని, టీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషి చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ గుండెమోని జయమ్మ, మార్కెట్‌కమిటీ చైర్మన్ సత్తువెంకటరమణారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ ఎం.సికిందర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ దన్నెబాషయ్య, ఎంపీడీవో నాగమణి, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డబ్బీకార్ శ్రీనివాస్, జిల్లా నాయకులు చిందం రఘుపతి, పల్లెజంగారెడ్డి, కందాళ శ్రీశైలం, జానీపాషా, మండల అధ్యక్షుడు ఏర్పులచంద్రయ్య, ప్రధానకార్యదర్శి మారసురేష్, అంతటిరాజు, వేణుగోపాల్, ఇబ్రహీం, విజయ్, లింగం, సర్పంచ్‌లు ఆనంగళ్లయాదయ్య, కాళ్లచంద్రమ్మ, మండల పశువైద్యాధికారి డా.చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.


ముచ్చర్లకుంటతండాకు చెందిన ఆడశిశువును శిశువిహార్‌కు తరలిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

సాకలేక శిశువిహార్‌కు..

మంచాల : మంచాల మండల పరిధి ముచ్చర్లకుంట తండాకు చెందిన ఉదావత్ బోడి గణేష్ దంపతులకు ఇప్పటికే నలుగురు ఆడపిల్లలు ఉండగా ఐదో కాన్పులోనూ ఆడశిశువు జన్మించింది. తమకు ఆర్థిక స్తోమత లేనందున ఆడశిశువును పోషించలేమంటూ ఐసీడీఎస్ అధికారులను సంప్రదించారు. దీంతో ఐసీడీఎస్ అధికారులు బాధిత తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించినా మాట వినకపోవడంతో ఆడ శిశువును శిశువిహార్‌కు తరలించినట్లు సీడీపీవో శాంతిశ్రీ తెలిపారు.

'ప్రతి గ్రామంలో 40వేల మొక్కలు నాటాలి'

యాచారం : ప్రతి గ్రామంలో విధిగా 40వేల మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని, ఇంతకు ముందు నాటిన మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని యాచారం ఎంపీడీవో కె.ఉష అన్నారు. బుధవారం యాచారం మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, సాంకేతిక నిపుణులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇంకుడు గుంతల తవ్వకం పనులు ముమ్మరం చేయాలన్నారు. హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఉపాధిజ పనులు మరింత ముమ్మరం చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఏపీవో నాగభూషణం, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ శివశంకర్ రెడ్డిలున్నారు.


లింగంపల్లిలో కృష్ణాపైప్‌లైన్ పగిలి వృథాగా పోతున్న తాగునీరు

పగిలిన పైప్‌లైన్

వృథాగా కృష్ణాతాగునీరు..

మంచాల : మంచాల మండల పరిధి లింగంపల్లిలో కృష్ణాపైప్‌లైన్ పగిలి నీరు వృథాగా పోతున్నా పట్టించుకునే నాథుడేలేకుండా పోయాడంటూ గ్రామస్థులు ఆరోపించారు. మిషన్‌భగీరథ కోసం వేసే పైప్‌లైన్ తవ్వకాలతో మంచినీటి పైప్‌లైన్ పగిలి నీరంతా పోతోందని దీంతో గ్రామంలో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇకనైనా అధికారులు వెంటనే స్పందించి పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టాలని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మహేందర్, తెలుగురైతు జిల్లానాయకుడు బత్తుల మోహన్ రెడ్డి, నాయకులు కిషన్, మూర్తి, బిలేష్‌యాదవ్, బత్తుల సుదర్శన్‌రెడ్డిలు డిమాండ్ చేశారు.

సర్కారు బడుల్లో ఒత్తిడిలేని నాణ్యమైన విద్య

ఎంపీటీసీ కోరే కళమ్మ


విద్యార్థినికి బంగారం అందిస్తున్న ఎంపీటీసీ కళమ్మ

ఆదిభట్ల: సర్కారు బడులలోనే ఒత్తిడి లేని నాణ్యమైన విద్య అందుతుందని ఆదిభట్ల ఎంపీటీసీ కోరే కళమ్మ జంగయ్య పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఆదిభట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత సంవత్సరం అత్యధిక మార్కులు (8.7) సాధించిన శ్రీవాణికి ఐదు గ్రాముల బంగారం బహుమతిగా అందజేయడంతో పాటు పాఠశాలలో చదువుతున్న 75 మంది విద్యార్థులకు స్కూలు షూస్, సాక్స్‌లు మరియు నోటు పుస్తకాలను కళమ్మజంగయ్య తన సొంత ఖర్చులతో అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సర్కారు బడుల్లో చదువుకుంటున్న నిరుపేద విద్యార్థులకు దాతలు ముందుకొచ్చి చేయూత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిభట్ల సర్పంచ్ రాజు, ఉప సర్పంచ్ పల్లె గోపాల్ గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాన్‌వెస్లీ, విద్యా కమిటీ చైర్మన్ జయమ్మ, ఉపాధ్యాయులు మరియు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకుంటాం

రోడ్డు నిర్మాణానికి సహకరించండి
ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

హయత్‌నగర్: ఇంజాపూర్ కమాన్ నుంచి వయా తొర్రూర్, బ్రాహ్మణపల్లి మీదుగా సాగర్ రోడ్డు వరకు మంజూరైన రోడ్డు నిర్మాణానికి ఉన్న ఇబ్బందులను బుధవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పరిశీలించారు. బ్రాహ్మణపల్లి మధ్య గుండా రోడ్డును నిర్మించినట్లయితే సుమారు 30 మంది ఇళ్లను కూల్చి వేయాల్సి వస్తుండడంతో ఎమ్మెల్యే స్వయంగా బ్రాహ్మణపల్లి గ్రామానికి వెళ్లి పరిశీలించారు. ప్రత్యామ్నాయంగా మరో చోట నుంచి రోడ్డును నిర్మించాలని అధికారులను ఆదేశించారు. అక్కడ కూడా ఎవరివైన ఇళ్లు కూల్చాల్సివస్తే వారికి నష్ట పరిహారం ఇప్పించేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. అవసరమైతే ప్రభుత్వంతో చర్చించి డబల్ బెడ్‌రూం ఇల్లు ఇప్పించేందుకు తన వంతు కృషి చేస్తానని బాధితులకు హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంజాపూర్ సాగర్ నుంచి తొర్రూర్, వయా బ్రాహ్మణపల్లి మీదుగా రాగన్నగూడ సాగర్ రోడ్డు వరకు 9.8 కిలోమీటర్ల రోడ్డుకు రూ. 12 కోట్లు మంజూరు చేయించామని అన్నారు. ఈ రోడ్డు నిర్మాణంతో ఇక్కడ ఎంతో అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. రోడ్డు నిర్మాణానికి అందరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మమత, సర్పంచ్ మల్లేష్, టీఆర్ఎస్ సీనియర్ నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కొత్త కిషన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కందాళ బలదేవ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరక్టర్ ప్రభువర్ధన్‌రెడ్డి, ఆర్అండ్‌బీ డీఈఈ అమృత్‌రెడ్డి, బలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీ పౌండేషన్ కోర్సుపై వర్క్‌షాప్


వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్

ఇబ్రహీంపట్నం: ఎంపిక చేసిన సాంఘిక సంక్షేమ, గిరిజన గురుకులాల్లో ఈ విద్యాసంవత్సరం నుంచి 8వ తరగతినుంచి ఐఐటీ ఫౌండేషన్ కోర్సు ప్రవేశ పెట్టిన దున బుధవారం ఇబ్రహీంపట్నం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో వర్క్‌షాప్ జరిగింది. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల కార్యదర్శి డా.ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్‌తోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. ఇప్పటికే గౌలిదొడ్డిలో బాలుర, బాలికల కు వేర్వేరుగా ఇంటర్ విద్యతోపాటు ఐఐటీ ఫౌండేషన్ కోర్సు కొనసాగుతుండగా కొత్తగా పది పాఠశాలల్లో 8వ తరగతినుంచే ఈ కోర్సును ప్రవేశపెట్టారు ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులకు ఏ రీతిన ఈ కోర్సును చెప్పాన్నారనేది ఒక్కొక్కరుగా వివరించారు. శ్రీచైతన్య, నారాయణ కళాశాలలనుండి స్టడీ మెటీరియల్ తెప్పించి విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేస్తున్నట్లు పలువురు వివరించారు. ప్రణాళిక ప్రకారం బోధన చేస్తున్నట్లు చెప్పారు. ఈ వర్క్‌షాప్‌లో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల డిప్యూటీ సెక్రటరీలు సుధాకర్, రమాదేవి (అకడమిక్), ఓఎస్‌డి రంగారెడ్డి, లక్ష్మయ్య, అకడమిక్ కో-ఆర్డినేటర్ జార్జివర్గీ పాల్గొన్నారు.

మృతుడి ఘటనపై నేడు విచారణ..

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్)

మహబూబ్‌నగర్ జైల్లో శిక్ష అనుభవిస్తూ, ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై నేడు షాద్‌నగర్ ఆర్డీవో ఎం.కృష్ణ విచారణ జరపనున్నారు. ఫరూక్‌నగర్ మండలం జానంపేటకు చెందిన సున్నాల నర్సింహులు(26) మొయినాబాద్ మండలంలో నివసిస్తున్నాడు. ఓ కేసులో మహబూబ్‌నగర్ జైల్లో శిక్ష అనుభవిస్తున్నాడు. అతడు ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గత నెల 16న మృతి చెందాడు. ఈ కేసుకు సంబంధించి ఆర్డీవో కార్యాలయంలో మెజిస్టీరియల్ విచారణ జరపనున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు తెలిసిన వారు తమ వాంగ్మూలాన్ని నేడు నిర్వహించే విచారణలో తెలిపాలని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

ఫ్యాకల్టీ కోసం దరఖాస్తుల ఆహ్వానం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్)

సైదాబాద్ లక్ష్మీనగర్ కాలనీలోని బీసీ స్టడీ సర్కిల్‌లో సివిల్ సర్వీసెస్ శిక్షణ తీసుకునే అభ్యర్థులకు పేపర్-1, పేపర్-2లకు సంబంధించిన సబ్జెక్టులు బోధించేందుకు అర్హత, అనుభవం కలిగిన ఫ్యాకల్టీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్టడీ సర్కిల్ డైరక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల ఫ్యాకల్టీ బయోడేటాతో డైరెక్టర్, బీసీ స్టడీ సర్కిల్, రోడ్ నెంబర్-8, లక్ష్మీనగర్ కాలనీ, ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ ఎదురుగా సైదాబాద్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. పూర్తి వివరాలకు కార్యాలయం ఫోన్ నెం. 040-24071178 సంప్రదించాలని కోరారు.

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా కవిత

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్)



సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా జి.కవిత ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు చక్రపాణి చేతుల మీదుగా ఎన్నిక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, సీఐటీయూలో పదవి పెరగటంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. 15 ఏళ్లుగా రాష్ట్ర వ్యాప్తంగా 83 వేల మంది కార్మికులు మధ్యాహ్న భోజన పథకం నిర్వహిస్తున్నారని తెలిపారు. అత్యంత తక్కువ వేతనాలకు కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. కనీస వేతనం రూ. 18 వేలు చెల్లించాలనీ, అలాగే పెన్షన్, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, సాంఘిక భద్రత కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు.

20న ఉచిత కంటి వైద్య శిబిరం

ఆమనగల్లు : ఈ నెల 20న తలకొండపల్లి మండలం పడకల్ ఆవేర్ ఆసుపత్రిలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ కార్యదర్శి మోహన్‌రెడ్డి, పీఆర్వో ఎం.డి.పాష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అంథత్వ నివారణ సంస్థ సహకారంతో ఆమనగల్లు లయన్స్ క్లబ్, ఎనుగొండ రాంరెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి దృష్టిలోపం ఉన్నట్లయితే ఐవోఎల్ అపరేషన్లు చేయించడం జరుగుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని తలకొండపల్లి మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మోహన్‌రెడ్డి, పాష కోరారు.

జోనల్‌స్థాయి క్రీడాపోటీలు ప్రారంభం

శామీర్‌పేట రూరల్: గ్రామీణ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొని పతకాలను సాధించాలని ఎంపీపీ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. బుధవారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం మజీద్‌పూర్‌లో జైన్ హెరిటేజ్ పాఠశాల క్యాంపస్‌లో 63వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో జోనల్ స్థాయి రెండు రోజుల క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడా పోటీలకు పలు పాఠశాలల నుంచి విచ్చేసిన క్రీడాకారులను పరిచయం చేసుకుని అభినందిస్తూ మొదటి రోజు వాలీబాల్, కబడ్డీ, పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు క్రీడల్లో శిక్షణ పొంది అంతర్జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. క్రీడాకారులు పాఠశాల, గ్రామం, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

రెండు రోజుల పాటు క్రీడలను నిర్వహిస్తున్నట్లు జోనల్ క్రీడల ఇన్‌ఛార్జ్ మురళీకృష్ణ తెలిపారు. అండర్-14, 17 బాలబాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు, సెలక్షన్లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బుధవారం కబడ్డీ, వాలీబాల్, గురువారం ఖోఖో పోటీలు ఉంటాయన్నారు. మండలంలోని 15 పాఠశాలల నుంచి విద్యార్థులు పోటీల్లో పాల్గొంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ బండారి శ్రీనివాస్, పీఈటీలు సత్తిరెడ్డి, కేశవనాథ్, గోపాల్‌చారి, ఆనంద్, సిద్ధార్ధ, ప్రిన్స్‌పాల్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్య 'హారం'

హరితహారంలో జిల్లాకు అథమ స్థానం

ప్రభుత్వశాఖలన్నీ దాదాపు విఫలం

ఈ ఏడాది లక్ష్యం 1.70 కోట్లు

ఇప్పటి వరకు నాటిన మొక్కలు 49 లక్షలు

ఇందులో రెండుశాఖలు నాటిన మొక్కలే 40 లక్షలు

ఈ లెక్కలపైనా అనుమానాలే

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

వృక్ష సంపదను పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న హరితహారం కార్యక్రమం జిల్లాలో అభాసుపాలవుతోంది. మూడో విడత జిల్లాలో చేపట్టిన ఈ కార్యక్రమం అమల్లో అడుగడుగునా నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఈ ఏడాది హరితహారం కార్యక్రమం విజయవంతం చేసేందుకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేసినప్పటికీ అవి కాగిత లెక్కలకే పరిమిత మయ్యాయి. ఈ పథకం అమల్లో రాష్ట్రంలోనే జిల్లా చివరి నుంచి రెండో స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో ఇప్పటి వరకు 91.77 శాతం లక్ష్యాలు సాధించి నిజామా బాద్ జిల్లా అగ్రస్థానంలో ఉండగా రంగారెడ్డి జిల్లా 29.07 శాతమే మొక్కలు నాటి అథమస్థానంలో నిలిచింది. వికారాబాద్‌జిల్లా పరిస్థితి కూడా దాదాపు ఇంతే ఉంది. వికారాబాద్ హరితహారం అమల్లో చివరి నుంచి మూడోస్థానంలో నిలిచింది. జిల్లాలో ఈ ఏడాది హరితహారం పథకం కింద 1.70 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించిన సంగతి తెలిసిందే. అయితే ఇందులో ఇప్పటివరకు 49.41 లక్షలు మాత్రమే నాటారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసినప్పటికీ హరితహారం కార్యక్రమం జిల్లాలో ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేదు. గడిచిన నెలలో వర్షాలు సరిగా పడకపోవడమే కారణమని అధికారులు చెబుతున్నప్పటికీ జిల్లాలో ఈ ఏడాది సగటు కంటే అధికంగా పడ్డాయి. ఈ ఖరీఫ్‌లో సగటు కంటే 22 శాతం అధికంగా వర్షపాతం నమోదైంది. అయితే ఈ మేర జిల్లాలో మొక్కలు నాటే కార్యక్రమం జరగలేదు. ఈ కార్యక్రమం అమల్లో పలుశాఖలు తీవ్ర నిర్లక్ష్యం చూపిస్తున్నాయి. రెండు, మూడు శాఖల తప్పా మిగతా శాఖలన్నీ కనీసం పదిశాతం మొక్కలు కూడా నాటలేదు. ఇందులో జైళ్లశాఖతో పాటు పలు శాఖలు తీవ్ర నిర్లక్ష్యాన్ని చూపుతున్నాయి. హరితహారం కార్యక్రమంలో కీలక భాగస్వామిగా ఉన్న అటవీశాఖ నిర్ధేశించిన లక్ష్యాల మేర ఈ కార్యక్రమాన్ని అమలు చేయడంలేదు. హరితహారం అమల్లో వెనుకబడిన శాఖల్లో అటవీ శాఖ కూడా ఉండడం అధికారులను నివ్వెరపరుస్తోంది. అటవీశాఖ ఈ ఏడాది 16.88 లక్షల మొక్కలను నాటాలని లక్ష్యంగా నిర్ణయించింది. ఇందులో ఇప్పటి వరకు కేవలం 2.93 లక్షల మొక్కలు మాత్రమే నాటింది. వ్యవసాయశాఖ 45.56 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటి వరకు 11.96 లక్షల మొక్కలు నాటినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. ఈ లెక్కలపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విద్యాశాఖ నాలుగు లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటి వరకు 88 వేల మొక్కలు నాటింది. పంచాయతీరాజ్ శాఖ నాలుగు లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించగా కేవలం 13 వేల మొక్కలు మాత్రమే నాటారు. అలాగే ఇరిగేషన్‌శాఖ రెండు లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించగా కేవలం 16 వేల మొక్కలు నాటింది. ఎక్సైజ్‌శాఖ 8 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించగా ఇప్పటివరకు 1.11 లక్షల మొక్కలు నాటింది. మున్సిపల్ శాఖ నాలుగు లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించగా 1.17 లక్షల మొక్కలు నాటారు . వైద్య, ఆరోగ్యశాఖ లక్ష మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించగా కేవలం మూడు వేల మొక్కలు మాత్రమే నాటడం గమనార్హం. పోలీసుశాఖ ఆరులక్షల మొక్కలు నాటాలని నిర్ణయించగా కేవలం 63 వేల మొక్కలు నాటింది. పరిశ్రమలశాఖ రెండు లక్షల మొక్కలకు 93 వేల మొక్కలు నాటించింది. ఉద్యానశాఖ రెండున్నర లక్షలకు 21వేల మొక్కలు మాత్రమే నాటారు. డీఆర్‌డీఓకు సంబంధించి వివిధ పథకాల ద్వారా లబ్ధిదారులతో పెద్ద సంఖ్యలో మొక్కలు నాటించాలని నిర్ణయించారు. జిల్లా వ్యాప్తంగా 28.9 లక్షల మొక్కలు నాటించాలని నిర్ణయించగా దాదాపు అంటే 28.73 లక్షల మొక్కలు నాటినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. వీటిపైనా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇక దేవాదాయశాఖ ద్వారా నాలుగు లక్షల మొక్కలు నాటించాలని నిర్ణయించగా ఇప్పటివరకు 18 వేల మొక్కలు మాత్రమే నాటారు. సాంఘిక సంక్షేమశాఖ ద్వారా లక్ష మొక్కలు నాటించాలని నిర్ణయించగా ఇప్పటివరకు మూడువేల మొక్కలు నాటారు. అలాగే గిరిజన సంక్షేమశాఖ ద్వారా 50 వేల మొక్కలు నాటించాలని నిర్ణయించగా ఇప్పటి వరకు కేవలం వేయి మొక్కలే నాటారు. అలాగే బీసీ సంక్షేమశాఖ ద్వారా 50 వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటివరకు కేవలం 741 మొక్కలు నాటారు. మార్కెటింగ్ శాఖ ద్వారా రెండు లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించగా ఇప్పటి వరకు 5 వేల మొక్కలు నాటారు. జైళ్ల శాఖ ద్వారా 25 లక్షలు మొక్కలు నాటాలని నిర్ణయించగా ఇప్పటి వరకు ఒక్క మొక్క నాటలేదు. ఆర్టీసీ ద్వారా 50 వేల మొక్కలు నాటాలని నిర్ణయించగా ఇప్పటివరకు కేవలం 815 మొక్కలు నాటారు. గనులశాఖ 20 వేల మొక్కలు నాటాలని నిర్ణయించగా దాదాపు లక్ష్యాన్ని చేరుకుంది. బుధవారం వరకు 19175 మొక్కలు నాటింది. పౌర సరఫరాల శాఖ లక్ష మొక్కలు నాటించాలని నిర్ణయించగా 5 వేల మొక్కలు మాత్రమే నాటించింది. ఇతర ప్రభుత్వ, ప్రైవేటుశాఖలతో పాటు ఐటీ పార్కులు, పారిశ్రామిక వాడల్లో 11.46 లక్షల మొక్కలు నాటించాలని నిర్ణయించగా ఇప్పటి వరకు కేవలం 1119 మొక్కలు మాత్రమే నాటారు. అంటే కేవలం ఒక శాతం మొక్కలు మాత్రమే ఇప్పటి వరకు నాటారు.



హరితహారం మొక్కలు(ఫైల్‌ఫొటో)

హరిత సైన్యాలు ఎక్కడా?

హరితహారం కింద మొక్కల నాటడంతో పాటు వాటి సంరక్షణ కోసం గ్రామ స్థాయిలో గ్రీన్ బ్రిగేడియర్లు (హరిత సైన్యాలు) ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో జిల్లాలోనూ బ్రిగేడియర్ల ఏర్పాటు మొదలు పెట్టారు. కానీ ఇవి పూర్తిస్థాయిలో ఇక్కడ ఇంకా ఏర్పాటు కాలేదు. రంగారెడ్డి జిల్లా కంటే చిన్న జిల్లాలైన జగిత్యాల, నిజమాబాద్ జిల్లాల్లో దాదాపు 1800 బ్రిగేడియర్లు ఏర్పాటు చేసి సుమారు 40 వేల మంది సభ్యులను చేర్చారు. అయితే ఇక్కడ మాత్రం కేవలం 674 బ్రిగేడియర్లను ఏర్పాటు చేశారు. ఇందులో 4249 మంది మాత్రమే సభ్యులు ఉన్నారు.

రుబెల్లా టీకా సిద్ధం..



ఐదు వారాల పాటు కార్యక్రమం

7 లక్షల మంది చిన్నారులకు వేయటమే లక్ష్యం

ఒకే టీకాతో రెండు వ్యాధుల నివారణ

9 నెల శిశువు నుంచి

15 ఏళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరి

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్)

జిల్లాలో నేటి నుంచి రుబెల్లా టీకాలు వేయనున్నారు. ఐదు వారాలపాటు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. 9 నెలల శిశువు నుంచి 15 ఏళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరి టీకాలు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో మొత్తం 7,06,815 మంది పిల్లలకు టీకాలు వేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. వీరిలో 9 నెలల నుంచి ఏడాదిలోపు శిశువులు 7,068 మంది ఉన్నారు. అలాగే ఏడాది నుంచి మూడేళ్ల లోపు పిల్లలు 96,532 మంది ఉండగా మూడేళ్ల నుంచి ఐదేళ్లలోపు పిల్లలు 99,131 మంది ఉన్నారు. ఐదు నుంచి 15 ఏళ్లలోపు బాలబాలికలు 5,04,084 ఉంటారు. వీరందరికి తప్పనిసరిగా రుబెల్లా టీకా వేసేలా ప్రణాళిక రూపొందించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు 2,709 ఉన్నాయి. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలు 1,765 ఉండగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 32 ఉన్నాయి. ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలు 233 ఉన్నాయి. జిల్లా మొత్తంలో ఒక పరిమిత కాలవ్యవధిలో ఎంఆర్ టీకాను 9 నెలల నుంచి 15 సంవత్సరాల లోపు చిన్నారులందరికీ వేయనున్నారు. గతంలో వ్యాక్సినేషన్ పొందిన వారికీ, పొందని చిన్నారులకూ ఈ టీకా ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అన్ని పాఠశాలల్లో, కమ్యూనిటీ బడుల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో, ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో టీకాను వేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. 250 మంది పిల్లలను కలుపుకుని ఒక యూనిట్‌గా చేస్తూ టీకా వేస్తున్నారు. పాఠశాలలో ఎంత మంది పిల్లలు ఉన్నా ఒకే రోజు ఈ టీకాలు వేసేలా వైద్య ఆరోగ్యశాఖ ముందుకు సాగుతోంది. ఇటుక బట్టీలు, సంచార జాతులు ఉన్నచోట 382 మంది పిల్లలను గుర్తించి 4 యూనిట్లుగా ఎంపిక చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వాక్సిన్‌ను సరఫరా చేశారు. ఐదు వారాల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో మొదటి రెండు వారాల్లో పూర్తిగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లోనే టీకా వేయనున్నారు. మిగిలిన రెండు వారాల్లో అంగన్‌వాడీలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాల్లో టీకా ప్రక్రియ కొనసాగనున్నది. మిగిలిపోయిన పిల్లలు ఎవరైనా ఉంటే... ఐదో వారంలో టీకాలు వేసేందుకు చర్యలు తీసుకొంటున్నారు. గతంలో ఎంఆర్ టీకా వేసుకున్నా.. సరే తిరిగి టీకా పొందాలని వైద్యులు చెబుతున్నారు. అనుకోకుండా రుబెల్లా వికటిస్తే.. మెరుగైన వైద్యం అందించేందుకు 40 టీంలను ఏర్పాటు చేశారు. సంబంధించిన మందుల కిట్‌ను సిద్ధం చేశారు. జిల్లాలోని ఐదు మెడికల్ కళాశాలలతో కలుపుని హైటెక్నికల్ టీంలను ఏర్పాటు చేశారు. అందులో అత్యవసర సేవలను అందించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు.

చైతన్య యువజన సంఘం కార్యవర్గం ఎన్నిక

కందుకూరు : కందుకూరు గ్రామ చైతన్య యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు కందడి కుమార్ ప్రకటించారు. బుధవారం మండలకేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యక్షులుగా పాముల రాము, ఎగ్గిడి జగదీష్, ప్రధానకార్యదర్శిగా ఎగ్గిడి కుమార్, కోశాధికారిగా కందడి శ్రీరామ్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు రమేష్, బుగ్గరాములు, క్రిష్ణ, రాజు, ఐలయ్య, వెంకటేష్, రవీందర్, నర్సింహ్మ పాల్గొన్నారు.

ఘనంగా కోటమైసమ్మ బోనాలు



అమ్మవారిని దర్శించుకున్న సబితాఇంద్రారెడ్డి





బోనాలతో తరలివస్తున్న మహిళలు, పోతరాజుల విన్యాసాలు

- **వేలాదిగా తరలివచ్చిన ప్రజలు**
- **అమ్మవారిని దర్శించుకున్న మాజీహోంమంత్రి పి.సబితారెడ్డి, ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి**

మహేశ్వరం : ప్రతియేటా శ్రావణమాసం చివరివారంలో జరిగే బోనాలు మహేశ్వరం మండలకేంద్రంలో ప్రత్యేకత సంతరించుకుంది. చారిత్రాత్మక ఘడికోటమైసమ్మ బోనాలు బుధవారం అత్యంత వైభవంగా జరిగాయి. గోల్కొండ చివరి నవాబు తానీషా కాలంలో ప్రధానపాత్ర పోషించిన అక్కన్న, మాదన్నలు నిర్మించిన ఘడికోటలో అనాదిగా కోటమైసమ్మ బోనాలు జరుగుతున్నాయి. గోల్కొండ, మహంకాళి, లాల్ దర్వాజ బోనాలు జరిగిన తర్వాత చివరగా జరిగే మహేశ్వరం ఘడికోట బోనాల ఉత్సవాల్లో హైదరాబాద్, జంటనగరాలతోపాటు మహేశ్వరం చుట్టుపక్కల ప్రాంతాలు, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ హోంమంత్రి సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి పాల్గొని పూజలు చేశారు. సాయంత్రం సామూహికబోనాల ఊరేగింపులో మండల కేంద్రంలోని అన్ని బస్తీలు, అనుబంద గ్రామాల నుండి వేలాది మంది మహిళలు పాల్గొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కోటమైసమ్మ బోనాల్లో మహేశ్వరం గంగపుత్రుల జాల పందిరి, పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, డప్పుల దరువులు, బ్యాండుమేళాల మధ్య యువతీయువకుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ ఉత్సవాల్లో సర్పంచ్ ఎస్. నందం, ఉప సర్పంచ్ కె. రాములు, వైస్ ఎంపీపీ ఎం. స్వప్నానవీన్, బుజ్జిబద్రునాయక్, ప్రేమలతలాజర్, నాయకులు తోటబాయి సత్యనారాయణ, అల్లె బిక్షపతి, కుమార్, మీతీలాల్, మోతె యాదయ్య, గోవర్ధన్‌రెడ్డి, అంజప్ప, ఎం. శివమూర్తి, ఎం. వత్తుల రఘుపతి, సామయ్య, ఎం.నవీన్, పి.అంబయ్యయాదవ్ పి.సుదర్శన్‌యాదవ్, ఎన్. శ్రీనువాస్‌గౌడ్, ఎన్. సుధీర్‌గౌడ్, నాగేశ్వర్, కె.చంద్రయ్యముదిరాజ్, కాకి ఈశ్వర్, అశోక్, అల్లె శంకర్, సంజీవ, జె.రమేష్, విజయ్, రాకేష్, అంజయ్య, యాదయ్యలతోపాటు అన్ని పార్టీల నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కొత్తగూడలో కట్టమైసమ్మ బోనాలు

కందుకూరు : మండలపరిధిలోని కొత్తగూడ గ్రామంలో బుధవారం కట్టమైసమ్మ బోనాలను ఘనంగా జరుపుకున్నారు. మూడు రోజులపాటు గ్రామంలో కట్టమైసమ్మ, పోచమ్మ, ఎల్లమ్మ దేవతలకు గ్రామస్థులు బోనాలను తీసుకెల్లి మొక్కులు తీర్చుకుంటారు. ఉత్సవాల్లో పోతరాజు విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆర్.యాదయ్య, టీఆర్ఎస్ నాయకుడు ఎస్. ప్రకాశ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు పి.సుధాకర్‌రెడ్డి, టీడీపీ నాయకుడు ఎస్ శేఖర్‌గౌడ్, బీజేపీ నాయకుడు బాలేష్‌తోపాటు గ్రామస్థులు తిరుపతిరెడ్డి, దామోదర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు. గురువారం పోచమ్మకు, శుక్రవారం ఎల్లమ్మ దేవతలకు బోనాల సమర్పిస్తారు.



కొత్తగూడలో బోనాల ఊరేగింపు

ఉత్తమ సేవలకు పురస్కారాలు

మహేశ్వరం : నాలుగు సంవత్సరాలుగా మండలంలో రైతులకు అందుబాటులో ఉంటూ ఆధునిక వ్యవసాయం, ప్రభుత్వ పథకాల అమలు వంటి కార్యక్రమాలను ఎప్పటికప్పుడు రైతులకు చేరవేస్తూ వ్యవసాయ రంగంలో వివిధ రకాల సేవలందించినందుకు మహేశ్వరం మండల వ్యవసాయ అధికారి కోటేశ్వర్‌రెడ్డికి జిల్లా ఉత్తమ వ్యవసాయాధికారి అవార్డు దక్కింది. స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా మంగళవారం ఉప ముఖ్యమంత్రి మహమూద్‌అలీ, ఎంపీ, కలెక్టర్ చేతులమీదుగా అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు. అదేవిధంగా మహేశ్వరం మండలం నాగారం క్లస్టర్‌లో వ్యవసాయ విస్తరణాధికారిగా విధులు నిర్వహిస్తున్న ఇ. దీనాకు ఉత్తమ జిల్లా వ్యవసాయ విస్తరణ అధికారిగా అవార్డు దక్కింది. అలాగే మహేశ్వరం ఎస్సీ బాలుర వసతిగృహం వార్డెన్ రామకృష్ణలతోపాటు మండలపరిధిలోని సిరిగిరిపురం వీఆర్‌వో శ్రీనువాస్ కూడా డిప్యూటి సీఎం చేతుల మీదుగా ఉత్తమ అవార్డులు అందుకున్నారు.





ఉత్తమ అవార్డు అందుకుంటున్న ఏవో కోటేశ్వర్‌రెడ్డి, దీనా

ఎయిర్‌పోర్టులో అరుణాచల్‌ప్రదేశ్

సీఎంకు ఘనస్వాగతం



స్వాగతం పలుకుతున్న నాయకులు

శంషాబాద్ : శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి ప్రేమకుందుకు బీజేపీ నాయకులు బుధవారం ఘనస్వాగతం పలికారు. హైదరాబాద్‌లో జరిగే ఓ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన సీఎంను నాయకులు కొండశేఖర్, కె. ప్రశాంత్‌కుమార్‌లు పూల మాలలు, శాలువాలతో సన్మాణించారు.

తెలంగాణ విమోచనను

అధికారికంగా చేపట్టడంలో ప్రభుత్వం వివక్ష



వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

కందుకూరు : తెలంగాణ విమోచన దినోత్సవాలను టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారికంగా చేపట్టడానికి పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుందని బీజేపీ జిల్లా అధికారి ప్రతినిధి ఎం.అంజయ్య ఆరోపించారు. బుధవారం ఆపార్టీ మండల శాఖ అధ్యక్షుడు సాధ మల్లారెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్ పి.క్రిష్ణ కుమార్‌కు వినతిపత్రం ఇచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడారు. 1947లో దేశానికి స్వాతంత్ర్యం వస్తే తెలంగాణ రాష్ట్రం 1948లో దేశంలో విలీనమైందన్నారు. నిజాం నిరంకుశ పాలనకు సెప్టెంబర్ 17న విమోచన కలిగింది. ఆ రోజున ప్రభుత్వం ఎందుకు వేడుకలను జరుపుకోవడం లేదని ప్రశ్నించారు. గత ఎన్నికల ముందు ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్ధానాలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యారన్నారు. రాష్ట్రంలో మరోసారి అధికారంలోకి రావడానికి మైనారిటీ ఓట్ల కోసం టీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుంది తప్ప రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం కాదన్నారు. ఇప్పటికైనా కేసీఆర్ నిజాం పరిపాలనను తలపించేలా కాకుండా, తెలంగాణ ప్రజల మనోభావాలకు అనుగుణంగా పనిచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.నర్సింహారెడ్డి, సోమరాజు వెంకటేష్, కన్నయ్యగారి బాల్‌రాజ్, దయ్యాల యాదగిరి, నిమ్మ అంజిరెడ్డి, దూస వెంకటయ్య, దూస వెంకటయ్య, బొక్క సత్యనారాయణరెడ్డి, సామ దయాకర్‌రెడ్డి, పడమటి సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు ముచ్చర్లకు రేవంత్‌రెడ్డి రాక

కందుకూరు : మండలపరిధిలోని ముచ్చర్లలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠకు నేడు టీడీపీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి రానున్నట్లు ఆ పార్టీ జిల్లా నాయకుడు ఇ.రామచంద్రారెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు ఎగ్గిడి సత్తయ్య, నాయకులు ప్రవీణ్ నాయక్ తెలిపారు. బుధవారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. అమ్మవారి విగ్రహప్రతిష్ఠతోపాటు బోనాల ఊరేగింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు తూళ్ళ వీరేందర్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు.

నేడు వ్యాక్సిన్ ప్రారంభానికి రానున్న ఎమ్మెల్యే

కందుకూరు : తట్టు, రుబెల్లా వ్యాధులు ప్రాణాంతకమైనవని, వాటి బారిన పడకుండా పిల్లలకు టీకాలను వేయించాలని మండల వైద్యాధికారి డాక్టర్ విశ్వశాంతి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నేడు మండలకేంద్రంలో ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి చేతుల మీదుగా ఈ కార్ర్యమాన్ని ప్రారంభించునున్నట్లు తెలిపారు. ఉదయం 10గంటలకు నోబుల్ స్కూల్ ఆవర ణంలో విద్యార్థులకు టీకాలను వేయనున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలకు మందులు తప్పక వేయించాలని కోరారు. 9నెలల నుంచి 15 సంవత్సరాల వయస్సుగల పిల్లలకు టీకాలను వేయించాలన్నారు. మండలపరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 9,250మంది విద్యార్థులు ఉండగా అంగన్‌వాడీ కేంద్రాల్లో 5,315మంది పిల్లలు ఉన్నట్లు తెలిపారు. వీరికి ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, మందులు వేయనున్నట్లు తెలిపారు.

ఉత్తమ తహసీల్దారు సురేష్‌కుమార్‌కు సన్మానం



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న నాయకులు

శంషాబాద్ : స్వాత్రంత్య వేడుకల్లో తహసీల్దార్ సురేష్‌కుమార్ ఉత్తమ అవార్డు అందుకోవడాన్ని పురస్కరించుకొని టీఆర్ఎస్ మండల నాయకులు బుధవారం ఆయన కార్యాలయంలో సన్మాణించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వై. సురేష్ గౌడ్, టీఆర్ఎస్ నాయకులు చంద్రారెడ్డి, దండు ఇస్తారి, శ్రీనివాస్, సుబ్బి, సుదర్శన్, వెంకటేష్‌గౌడ్, హనుమంతు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్వాల్‌గూడ ఎంపీటీసీ కర్నం జయమ్మ ఆకస్మిక మృతి

శంషాబాద్ : శంషాబాద్ మండలం కోత్వాల్‌గూడ గ్రామానికి చెందిన ఎంపీటీసీ కర్నం జయమ్మ ఆకస్మికంగా మృతిచెందారు. కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె నగరంలోని కాంటినెంటల్ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ బుధవారం సాయంత్రం మృతిచెందింది. ఎంపీటీసీ మృతికి ఆమె కుటుంబ సభ్యులకు ఎంపీపీ చెక్కల ఎల్లయ్య, వైస్ ఎంపీపీ వై.సురేష్‌గౌడ్‌లు సంతాపం తెలిపారు.

'ప్రధానోపాధ్యాయుడిని బదిలీ చేయాలి'

చౌదరిగూడ: మండల పరిధిలోని రావిర్యాల గ్రామ పంచాయతీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని బదిలీ చేయాలని బుధవారం ఎంఈవో కిష్టారెడ్డికి గ్రామ సర్పంచ్ శివకుమార్ ఆధ్వర్యంలో గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నాలుగు సంవత్సరాల నుంచి స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలకు గ్రామ పంచాయతీకి, గ్రామస్థులకు సమాచారం ఇవ్వడం లేదని, జెండావిష్కరణకు విద్యార్థులను హాజరు కానివ్వడం లేదని ప్రధానోపాధ్యాయుడు సమయపాలన పాటించడం లేదని తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో గ్రామస్థులు రవీందర్, నీలనర్సింలు, శేఖర్, యాదయ్య, వెంకటయ్య, శివరాములు తదితరులు పాల్గొన్నారు.



గ్రామాభివృద్ధే లక్ష్యం

ఎమ్మె సత్యనారాయణ, సర్పంచ్, శేరిగూడబద్రాయపల్లి

కొత్తూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక రకాల నిధులు మంజూరు చేస్తున్నారు. అభివృద్ధి పనులతో పాటు అర్హులకు సంక్షేమ పథకాలు ఏ విధంగా అందుతున్నాయనే వషయంపై సర్పంచ్ ఎమ్మె సత్యనారాయణతో ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ.

ప్ర: గ్రామాభివృద్ధి కోసం ఎన్ని నిధులు వెచ్చించారు?

జ: లక్షలాది రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టాం. ముఖ్యంగా గ్రామంలో నెలకొన్న మంచినీటి సమస్య కోసం 20లక్షలు ఖర్చుపెట్టి సమస్యను పరిష్కారించాం.

ప్ర: ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టారు?

జ: పారిశుధ్యం కోసం గ్రామంలో భూగర్భ మురుగు నీటి కాలువల నిర్మాణాలు చేపట్టాం. ఎమ్మెల్యే సహకారంతో సీడీపీ నిధుల ద్వారా సీసీ రోడ్ల కోసం 12లక్షలు మంజూరయ్యాయి.

ప్ర: గ్రామాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు ఏమైనా రూపొందించారా?

జ: కేంద్ర మంత్రి దత్తాత్రేయ గతంలో గ్రామంలో పర్యటించారు. సీసీ రోడ్లు, ఎస్‌బీ పల్లి నుంచి దర్గా వరకు రహదారి, బీసీ, కురుమ, యువజన సంఘం కోసం రెండున్నర కోట్ల ప్రణాళికలను రూపొందించి కేంద్ర మంత్రి సహకారంతో కలెక్టర్‌కు అందజేశాం.

నూతన కమిటీ ఎన్నిక

షాద్‌నగర్ టౌన్: పట్టణ ట్రాలీ ఆటో యూనియన్ నూతన కమిటీని సీఐటీయూ అనుబంధ కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షునిగా శ్రీను, ప్రధానకార్యదర్శిగా గణపతి, కోశాధికారిగా ఎండీ. కలీం, సలహాదారులుగా మోహన్, గోపాల్‌తో పాటు మరో 12 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్‌రూరల్: నియోజకవర్గానికి నూతనంగా మంజూరైన గిరిజన బాలికల కళాశాల వసతిగృహానికి దరఖాస్తులు చేసుకోవాలని ఇంచార్జి వార్డెన్ గోపాల్‌నాయక్ తెలిపారు. వసతిగృహాన్ని పట్టణంలోని హాజీపల్లి రోడ్డులో గతంలో కస్తూర్బాగాంధీ బాలికల వసతిగృహంలో ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న విద్యాసంవత్సరానికి గాను ఇంటర్ నుంచి పీజీ వరకు చదువుతున్న గిరిజన బాలికలు ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9010340682 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

బాలికలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

• వాయిస్ ఫర్ గర్ల్స్ ఎన్‌జీవో సంస్థ



ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఎన్‌జీవో సభ్యులు

కేశంపేట: బాలికలు బాలురకు ఏమాత్రం తీసిపోరని బాలికలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని వాయిస్ ఫర్ గర్ల్స్ ఎన్‌జీవో ఫీల్డ్ కోఆర్డినేటర్ కామాక్షి సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కేశంపేట కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఈనెల 11 నుంచి 20 వరకు బాలికలలో యుక్త వయసులో వచ్చే మార్పులు, సమాజంలో మమేకం అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని వాయిస్ ఫర్ గర్ల్స్ ఎన్‌జీవో వారు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం బాహ్య అంతర్ సౌందర్యం గురించి విద్యార్థులకు వివరించారు. అందంగా లేకపోయినంత మాత్రాన నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదని, ప్రతి ఒక్కరికి ఏదో అంశంలో ప్రజ్ఞ ఉంటుందని సూచించారు. సరైన పౌష్టికాహారంతో వ్యాధులను తట్టుకునే శక్తి వస్తుందని వివరించారు. అలాగే యుక్తవయసులో వచ్చే మార్పుల గురించి క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో గౌసియా బేగం, వాయిస్‌ఫర్ గర్ల్స్ కౌన్సిలర్స్ కళ్యాణి, రచన, హిందు, బిందు, కావ్య, తస్మియా పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుబెల్లా వ్యాక్సిన్‌పై అవగాహన ర్యాలీ

కేశంపేట: తట్టు రుబెల్లా వ్యాధుల నుంచి రక్షణ కల్పించేందుకు 9 నెలల నుంచి 15 సంవత్సరాలలోపు చిన్నారులకు రుబెల్లా టీకా వేయించాలంటూ కేశంపేట మండల కేంద్రంలో బుధవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులచే గ్రామ వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఒకే టీకాతో రెండు ప్రాణాంతక వ్యాధులను నివారించేందుకు టీకాను వేయించుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లావణ్య, కేశంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి డా.ప్రణీత్‌రెడ్డి పాల్గొన్నారు.

కొత్తూరులో..

కొత్తూరు: మండల కేంద్రంలో బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ స్రవంతి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. 9 నెలల నుంచి 15 సంవత్సరాలలోపు చిన్నారులకు రుబెల్లా టీకా వేయించాలంటూ సిబ్బంది నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది రవి తదితరలు పాల్గొన్నారు.



కేశంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

లారీపై దాడి చేసిన దొంగల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ శ్రీనివాస్, సీఐ

కొత్తూర్: రొడ్డు పక్క నిలిపిన లారీలో నిద్రిస్తున్న డ్రైవరును బెదిరింపులకు గురి చేసి నగదుతో పాటు సెల్‌ఫోన్ దొంగిలించుకపోయిన దొంగలను కొత్తూర్ పోలీసులు అరెస్ట్ చేసి కటకటాలకు పంపారు. కొత్తూర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో గల షాద్‌నగర్ రూరల్ సీఐ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో షాద్‌నగర్ ఏసీపీ శ్రీనివాస్ దోపీడీ వివరాలను వెల్లడించారు. నందిగామ మండల కేంద్రానికి చెందిన సందీప్ (22) డెకరేషన్ వర్క్స్ నిర్వహిస్తుంటాడు. ప్రీతమ్ అలియాస్ చింటూ (23) హైద్రాబాద్‌లోని రాంనగర్‌కు చెందిన వ్యక్తి. డిగ్రీ చదివి ఉద్యోగం కోసం కొత్తూర్‌కు వచ్చాడు. షాద్‌నగర్‌కు చెందిన మహ్మద్ సల్మాన్ (22) ఐటీఐ చేసి ఉద్యోగం కోసం నందిగామలో ఉంటున్నాడు. వనపర్తికి చెందిన సదానందరెడ్డి (21) ఐటీఐ పూర్తి చేసి ఉద్యోగం కోసం నందిగామలో ఉంటున్నాడు. ఈనెల 9న సందీప్, సదానంద్‌ల జన్మదినం కావడంతో నలుగురు కలిసి మద్యం సేవించారు. పారిశ్రామికవాడ శివారులో రోడ్డుపై నిలిచి ఉన్న లారీ వీరి కంట పడడంతో నలుగురు కలిసి లారీపై దాడి జరిపి అద్దాలు ధ్వంసం చేసి, అందులో నిద్రిస్తున్న డ్రైవర్ రాంజకన్ చౌహాన్‌ను బెదిరించి 9వేల నగదు, సెల్‌ఫోన్‌తో పాటు జాక్‌రాడ్‌తో ఉడాయించారు. ఈ మేరకు షాద్‌నగర్ రూరల్ సీఐ మధుసూదన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దొంగలను పట్టుకునేందుకు షాద్‌నగర్ రూరల్ సీఐ మధుసూదన్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి ముమ్మరంగా గాలింపులు చేట్టారు. బుధవారం తిమ్మాపూర్ చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అటుగా వెళ్తున్న నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. లారీపై దాడి చేసింది తామేనని విచారణలో ఒప్పుకున్నారు. ఈ మేరకు నలుగురు నిందితులను అరెస్ట్ చేసి 5వేల నగదు, సెల్‌ఫోన్, జాక్‌ను స్వాధీనం చేసుకున్నటు తెలిపారు. కేవలం ఆరు రోజుల్లో చేధించిన ఐడీ పార్టీ పోలీసులను ఏసీపీ అభినందించారు. విలేకరుల సమావేశంలో కొత్తూర్, నందిగామ ఎస్‌ఐలు శ్రీశైలం, హరిప్రసాద్‌రెడ్డి ఉన్నారు.

'ధర్నాను విజయవంతం చేయాలి'

నందిగామ: 17న జిల్లా కలెక్టరేట్ ఎదుట అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో ధర్నా చేపట్టనున్నట్లు ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు పబ్బె శేఖర్, టి.కృష్ణ బుధవారం తెలిపారు. యువతకు ఉద్యోగం, ఉపాధి, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. ధర్నాలో యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వృద్ధుడికి గాయాలు

కొత్తూర్: తిమ్మాపూర్ సమీపంలో 44వ నెంబర్ జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధుడు గాయపడ్డాడు. రోడ్డు దాటుతున్న టిప్పర్ లారీ ఢీకొనడంతో గాయపడ్డాడు. గాయపడ్డ వృద్ధుడిని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

రెవెన్యూ రికార్డులు సక్రమంగా ఉండాలి

• జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ స్వర్ణలత



స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

షాద్‌నగర్ రూరల్: రెవెన్యూ రికార్డులు సక్రమంగా నిర్వహించాలని జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఫరూఖ్‌నగర్ మండల ప్రత్యేకాధికారి స్వర్ణలత సూచించారు. మండల పరిధిలోని కొండన్నగూడ గ్రామంలో బుధవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. గ్రామసభకు హాజరైన ఆమె మాట్లాడుతూ కొన్ని సర్వేనెంబర్లు అస్తవ్యస్థంగా ఉన్నాయని, వాటిని సరిచేయాలని సూచించారు. స్మశానవాటికకు స్థలం కేటాయించాలని గ్రామస్థులు కోరారు. సమావేశంలో తహసీల్దార్ రామారావు, ఎలక్షన్ నయాబ్ తహసీల్దార్ జయశ్రీ, వీఆర్వో బచ్చయ్య, పంచాయతీకార్యదర్శి రమాదేవి, ఉపసర్పంచ్ రాములుయాదవ్, ఎంపీటీసీ సురేష్‌గౌడ్, నాయకులు గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పుస్తకాల సేకరణ భేష్'



గ్రంథాలయ కమిటీకి పుస్తకాలను అందజేస్తున్న జనార్దన్

షాద్‌నగర్ టౌన్: గ్రేడ్-1 శాఖా గ్రంథాలయంలో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పుస్తకాల సేకరణ కార్యక్రమం చాలా బాగుందని పాలమూరు సాహితీ సమితి కార్యదర్శి వల్లభాపురం జనార్ధన్ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో గత మూడు రోజులుగా పాత పుస్తకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా పలు ప్రాంతాల నుంచి పలువురు తమ వద్ద ఉన్న పాత పుస్తకాలను తీసుకువచ్చి వితరణ చేస్తున్నారు. జనార్ధన్‌తో పాటు ఆయన మిత్రులు పలు విలువైన పుస్తకాలను గ్రంథాలయానికి అందించారు. ఈ కార్యక్రమం ఈ నెల 19 వరకు కొనసాగుతుందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు లక్ష్మినర్సింహ్మారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు జంగరాజ్, జాంగారి నర్సింలు, ఆర్ల యాదయ్య, జూపల్లి శంకర్, శేఖర్, రవూఫ్, సాహితి కళా భారతి సభ్యులు హరీష్‌శర్మ, ఆనందీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రంలో బుధవారం పోచమ్మ బోనాలను వైభవంగా నిర్వహించారు. సర్పంచ్ అమృతమ్మ యాదయ్యాచారి పోచమ్మ, మైసమ్మ దేవరల ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామంలో పెద్ద ఎత్తున మహిళలు బోనాలను ఎత్తుకొని ఊరేగింపుగా గ్రామ దేవర వద్దకు తరలివెళ్లారు. పోచమ్మకు నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సజ్జల విశ్వనాథం, మాజీ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– కేశంపేట



శస్త్ర చికిత్సలే 'విజన్' లక్ష్యం

- లయన్స్‌క్లబ్ సహకారంతో వైద్య పరీక్షలు
- రూ.30ల కన్సల్టెన్స్ ఫీజు
- తాండూరులో ఉచిత కంటి ఆస్పత్రి ఏర్పాటుకు యోచన

తాండూరు : దృష్టిలోపం, కంటి సమస్యలతో బాధపడు తున్న పేద వర్గాలకు ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయడం లక్ష్యంగా విజన్ సెంటర్ పనిచేస్తుంది. సాధారణ కన్సల్టెన్స్ ఫీజు రూ.30లతోనే కంటి పరీక్షలు నిర్వహించి తదనం



విజన్ సెంటర్‌కు కంటి పరీక్షల కోసం వచ్చిన రోగులు

తరం కంటి శస్త్ర చికిత్సలు అవసరమైతే ఉచితంగా జరిపి స్తున్నారు. తాండూరులో లయన్స్‌క్లబ్ సహకారంతో ఏర్పా టుచేసిన విజన్ సెంటర్ పేరుతో నిరుపేదలకు ప్రయో జనం కలుగుతుంది. హైదరాబాద్ సాదురాం ఆస్పత్రి వైద్యుల సహకారంతో తాండూరు లయన్స్‌క్లబ్ శాఖ జూన్ 17న తాండూరులో విజన్ సెంటర్‌ను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయించారు. ప్రతి సోమవారం సాదురాం ఆస్పత్రి నుంచి కంటి వైద్య నిపుణులతోపాటు నలుగురు వైద్య సిబ్బంది తాండూరు విజన్ సెంటర్‌కువచ్చి కంటి పరీక్షలు చేస్తున్నా రు. కంటి శస్త్ర చికిత్సలు అవసరమున్నవారిని గుర్తించి అదేరోజు లయన్స్‌క్లబ్ సహకారంతో ఉచిత రవాణా, భోజన సౌకర్యాలను పేషంట్‌కు కల్పించి రూ.25వేల వ్యయం కాగల శస్త్ర చికిత్సలను ఉచితంగా చేయిస్తున్నారు. శస్త్ర చికిత్స అనంతరం రెండు రోజులకు పేషంట్లను తిరిగి ఇంటికి పంపిస్తారు. ఈ సెంటర్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 320 మంది ఔట్ పేషంట్లను పరిశీలించి 72మందికి ఉచితంగా శస్త్ర చికిత్సలు జరిపించారు. గతంలో లయన్స్ క్లబ్ నెలలో ఒకసారి కంటి ఉచిత వైద్య శిబిరాలను ఈ ప్రాంతంలో ఏర్పాటుచేసే అవసరమైనవారికి శస్త్ర చికిత్సల నిమిత్తం హైదరాబాద్‌కు తరలించేవారు. లయన్స్‌క్లబ్ సహ కారంతో విజన్ సెంటర్ ఏర్పాటు చేయడంతో ప్రస్తుతం ప్రతి సోమవారం తాండూరు విజన్ సెంటర్‌లో కంటి పరీక్షలు జరుపుతున్నారు. శాశ్వతంగా సెంటర్‌ను ఏర్పాటు చేసే విషయమై లయన్స్‌క్లబ్, సాదురాం ఆస్పత్రి వారు పరి శీలిస్తున్నారు. ఇక్కడ సెంటర్ ఏర్పాటుచేస్తే వికారాబాద్ జిల్లాతోపాటు మహబూబ్‌నగర్ జిల్లా, సంగారెడ్డి జిల్లాకు చెందినవారు, కర్ణాటక ప్రాంతానికి చెందిన చించోళి, గుర్మి ట్కల్ ప్రాంతాల కంటి రోగులకు ఉపయోగపడే అవకాశం


వైద్య పరీక్షలు చేస్తున్న సాధురాం ఆస్పత్రి వైద్యులు

ఉంది. కంటికి పొరలను సోకి హైదరాబాద్‌కు వెళ్లి చికిత్స చేసుకున్న వృద్ధులు చాలామంది ఉన్నారు. వారి సౌకర్యం కోసం తాండూరులో సెంటర్ ఏర్పాటుచేయడం ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. తాండూరులో ఈ విజన్ సెంటర్ ఏర్పాటుకు లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ వెంకటా చలం కృషి ఎంతో ఉంది.

కంటి పరీక్షల వివరాలిలా..

విజన్ సెంటర్ ప్రారంభం తర్వాత జూన్ 17న 15 మందికి, జూలై 3న 12 మందికి, 10న 15 మందికి, 17న 18 మందికి, 24న 9 మందికి, 31న 14 మందికి, ఆగస్టు 7న 9 మందికి కంటి శస్త్ర చికిత్సలు సాదురాం ఆస్పత్రి వైద్యుల సహకారంతో ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు నిర్వహిం చారు.

శాశ్వత సెంటర్ కోసం ప్రయత్నిస్తున్నాం..



ఈ ప్రాంతంలో కంటి రోగులు అధికంగా ఉన్నారని గుర్తించాము. లయన్స్‌క్లబ్ నేత్ర దానం విషయంలో ప్రత్యేక చొరవ చూపి స్తుంది. అందులో భాగంగానే నిరుపేద కుటుంబాలకు చెందిన దృష్టిలోపం, కంటి సమస్యలతో బాధపడుతున్నవారికి పరీక్షల తోపాటు ఆపరేషన్ చేయించాలని లయన్స్ క్లబ్ నిర్ణయించింది. ఈమేరకు తాండూ రులో శాశ్వత సెంటర్ కోసం ప్రయత్నిస్తు న్నాము. ఈ విషయాన్ని మంత్రి మహేంద రెడ్డి దృష్టికి తీసుకెళ్లాము.

- భద్రన్న, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు

ప్రజల్లో చైతన్యం తెస్తున్నాం..



కంటి సమస్యలతో బాధపడుతున్న రోగులను గుర్తించి చైతన్యం తెస్తున్నాము. గ్రామాల్లో చాటింపు చేసి ప్రజల్లో చైతన్యం కలిగిస్తున్నాము. ఈ ప్రాంతంలో కంటి స మస్యలతో బాధపడకుండా ప్రతి ఒక్కరూ ఉండాలని భావిస్తున్నాము. ఉచిత సేవల ను అందించడంలో లయన్స్‌క్లబ్ అధిక ప్రా ధాన్యత ఇస్తుంది.

- వినోద్‌కుమార్‌జైన్, విజన్ సెంటర్ కో-చైర్మన్

ట్రా'ఫికర్'

- షాద్‌నగర్ ముఖ్యకూడలిలో అడ్డగోలుగా ప్రైవేట్ వాహనాల పార్కింగ్
- నష్టపోతున్న ఆర్టీసీ
- రోజురోజుకు పెరుగుతున్న ఫుట్‌పాత్ వ్యాపారం
- ఇబ్బందులకు గురవుతున్న వాహనదారులు, ప్రజలు

షాద్‌నగర్ అర్బన్ : షాద్‌నగర్ ముఖ్యకూడలి మొత్తం ట్రాఫిక్ జాంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 44వ జాతీయ రహదారి, ముంబై బైపాస్ రహదారి కావడంతో నిత్యం వచ్చే భారీ వాహనాలతో ముఖ్యకూడలి మొత్తం ట్రాఫిక్‌కు కారణమవుతుంది. పరిగి రోడ్డు, హైద రాబాద్, మహబూబ్‌నగర్ వైపు వెళ్లే రహదారుల పక్కన ఫుట్‌పాత్ వ్యాపారం, ప్రైవేటు వాహనదారులు రోడ్డుపైనే తమ వాహనాలు నిలు పుతుండటంతో మరింత ట్రాఫిక్ సమస్యకు కారణమవుతుందని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు.

మహబూబ్‌నగర్, జడ్చర్ల రోడ్డు వైపు ఇలా..

షాద్‌నగర్ ముఖ్యకూడలి నుంచి మహబూబ్‌నగర్, జడ్చర్ల వైపు వెళ్లే ట్రాఫిక్ సిగ్నల్ వద్దనుంచే వాహనచోదకులు చాలా ఇబ్బందులకు గుర వుతున్నారు. ముఖ్యకూడలి నుంచి వెంకటేశ్వర థియేటర్ వరకు ఉన్న వ్యాపార దుకాణాల ఎదుట నిలిపే వాహనాలు, ఫుట్‌పాత్ వ్యాపారులు, ప్రైవేటు వాహనదారులు రోడ్డుపైనే తమ వాహనాలు నిలుపుతుండ టంతో ట్రాఫిక్‌కు కారణమవుతుంది. ఇక్కడే హోటళ్లు, మొబైల్ సెంటర్లు, వైన్స్‌లు, బార్లు ఉండటంతో గంటల తరబడి రోడ్డుపై తమ వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. ఇక ప్రైవేటు వాహనదారులు ప్రయాణీకుల కోసం రోడ్డుపై నిలపడంతో ఇతర వాహనాలకు ఇబ్బందులు తప్పడం లేదు.


పరిగి రోడ్డులో బస్టాండ్ ఎదురుగా నిలిపిన ఆటోలు



షాద్‌నగర్ ముఖ్యకూడలి

ఆర్టీసీ బస్సులకు సైతం స్థలం ఇవ్వకుండా ప్రైవేటు వాహనదారులు బస్సులు తొందరగా వెళ్లేలా ట్రాఫిక్‌ను సృష్టిస్తున్నారు.

పరిగి రోడ్డులో..

షాద్‌నగర్ పట్టణంలోని పరిగి రోడ్డులో ఉన్న చిన్నపాటి స్థలంలో ఆటోలు అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. రోజురోజుకు ఫుట్‌పాత్ వ్యాపారులు పెరిగిపోవడంతో ట్రాఫిక్ సమస్యకు కారణమవుతోంది. బస్టాండ్ ఎదురుగా నిలిపిన ఆటోలు షాబాద్, చేవెళ్ల, కొందుర్గు, పరిగి తదితర గ్రామాలకు ప్రయాణీలను చేరవేస్తుంటారు. ప్రయాణీకులను ఎక్కించుకునే క్రమంలో పోటీపడి ఆటోలను రోడ్డుపైనే నిలపడం, అక్కడే ఉన్న వివిధ దుకాణాలు, ఆసుపత్రులకు వచ్చే వాహనచోదకులు కూడా రోడ్డుపైనే తమ వాహనాలను పార్కింగ్ చేయడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇదే క్రమంలో బస్టాండ్‌లోకి బస్సులు ఒకే రహదారి గుండా వచ్చి వెళ్తుండటం, ముంబాయి బైపాస్ రోడ్డు కావడంతో రవాణా సరకులు తీసుకువచ్చే భారీ వాహనాలు ట్రాఫిక్ జాంతో ఇబ్బందులకు గురవుతున్నాయి. పరిగి రోడ్డులోని ఇతర కాలనీలకు సైతం వెళ్లలేని పరి స్థితి నెలకొంటోంది. రోడ్డుపై అడ్డదిడ్డంగా నిలిపే ఆటోలపై, దుకాణాల ముందు క్రమపద్ధతిలో నిలుపని వాహనాలపై చర్యలు తీసుకుని ట్రాఫి క్ సమస్య పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

హైదరాబాద్‌వైపు ఇలా...

శంషాబాద్, కొత్తూర్ వైపు నుంచి వచ్చిన ప్రైవేటు వాహనదారులు ముఖ్యకూడలిలో హైదరాబాద్ వైపు యూటర్న్ తీసుకుంటూ అక్కడే ప్రయాణీకులను ఎక్కించుకుంటున్నారు. పరిగి రోడ్డు వైపు నుంచి వచ్చిన వాహనాలకు ముందుకు వెళ్లేందుకు స్థలం లేకపోవడంతో ట్రాఫిక్‌కు కార ణమవుతుంది. ఆదివారం సంతకావడంతో సిగ్నల్ పడినప్పటినుంచే రోడ్డు మధ్యలోనే ప్రయాణీకులను ఎక్కించుకుంటూ ట్రాఫిక్‌కు కారణమ వుతున్నారు. ఇక్కడి నుంచి ఇంకాస్త ముందుకు వెళితే ఇతర కాలనీలకు వెళ్లే రోడ్డు వద్ద ప్రైవేటు వాహనాలు నిలిపి కాలనీలకు వెళ్లేవారికి సైతం ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇదేమిటని కాలనీవాసులు ప్రశ్నిస్తే దురు సుగా ప్రవర్తిస్తున్నారని ప్రజలు పేర్కొన్నారు. సంబంధిత పోలీస్‌శాఖ అధికారులు ట్రాఫిక్‌జాంకు కారణమవుతున్న అంశాలను దృష్టిలో పెట్టు కుని సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

దీనిని ధరించకపోతే..

హెల్.. మెట్.!

చేవెళ్ల రూరల్ : హెల్మెట్ దీని అర్థం..! శిరస్త్రాణం..! అంతరార్థం.. నరకానికి వెళ్లి నట్లే..! అర్థమవలేదా.... ఇంగ్లీష్‌లో హెల్... అంటే నరకం... మెట్ అంటే కలుసుకు న్నారు..!! మరింత విపులంగా చెప్పాలంటే... ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట ద్విచక్ర వాహన ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. తలకు తీవ్రగాయాలతో అనేకమంది ప్రాణాలు కోల్పో తున్నారు. వారు హెల్మెట్ ధరిస్తే తలకు తీవ్ర గాయాలయ్యేవికావు. ప్రాణాపాయం ఉండేది కాదు. శిరస్త్రాణం ధరించకుండా ప్రాణాన్ని మూల్యంగా చెల్లించనందుకు వీరికి స్వర్గప్రా ప్తి తలకు మూసుకుపోతాయి. కన్న పేగును, కట్టుకున్న భార్యను, కన్న పిల్లలను, ఇలా అందరినీ ఆగమాగం చేసి వెళ్లినందుకు వీరికి నరక ద్వారం తెరుచుకుంటుంది. ప్రాణా పాయం లేకపోయినా తలకు తగిలిన తీవ్రగా యాలతో చిరకాలం నరకం అనుభవిస్తారు. ఇలాంటి ప్రమాదాలనుంచి తప్పించుకునేందు కుగాను ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని పోలీసులు సూచిస్తున్నారు.

చిన్నతప్పు.. పెద్ద శిక్ష

హెల్మెట్ ధరించకపోవడమన్న ఒకే ఒక చిన్న తప్పు ఎందరివో నిండు ప్రాణాలను బలి గొంటోంది. వారి తల్లిదండ్రులకు గర్భశోకాన్ని




మిగులుస్తోంది. తమపై ఆధారపడిన భార్యాబి డ్డల బతుకులను భవితను ఆగమాగం చేస్తోంది. శిరస్త్రాణం కాపాడే ప్రాణం అంటూ ట్రాఫిక్ పోలీసులు నెత్తీనోరు కొట్టుకుని చెబు తున్నా కూడా కొందరు ద్విచక్రవాహన చోద కులు చెవికెక్కడం లేదని వాపోతున్నారు.

హెల్మెట్‌కు దూరంగా ఉండండి..

ఒక్కసారి తలెత్తి అలా రోడ్డు చూడండి. నెత్తిపై హెల్మెట్ లేకుండా ఎంతమంది ద్విచక్ర వాహన చోదకులు వెళ్తున్నారో లెక్కించండి.. వారిలో ఒకరుగా మీరు ఉండకండి హెల్మెట్ ధరించాలని పోలీసులు సూచిస్తున్నారు. ద్విచ క్రవాహనంపై వెళ్తున్నప్పుడు కొందరు హెల్మెట్ ను తలకు పెట్టుకోకుండా వాహనం ముందు పెట్టుకుంటుంటారు. ప్రమాదం జరిగితే తలకు గాయాలయ్యే అవకాశం ఉందని పోలీ సులు వివరిస్తున్నారు.

బరువు కాదు... భద్రత, బాధ్యత



తలపై హెల్మెట్ పెట్టుకోవడానికి అనేకమంది బరువుగా భావిస్తున్నా రు. కానీ అది మన భద్రత కోసమని దానిని ధరించడం బాధ్య తని గుర్తించడం లేదు. మేం ఎంతగా చెబుతున్నా అనేక మంది వినడం లేదు. కేసులు నమోదుచేసి జరిమానా విధిస్తేనన్నా మార్పు వస్తుందే మోనని ఆ పని కూడా చేస్తున్నాం. ఫలితం శూన్యం, మీ ప్రాణం మీ ఒక్కరిదే కాదు.. మీ అమ్మానాన్నది. మీ భార్యాపిల్లలది. మీ ఆత్మీయు లది. ప్రమాదంలో మీకేమైనా జరగరానిది జరిగితే మీరందరూ ఎంతగా బాధపడతారో ఒక్కసారి ఆలోచించండి..!!

- గురువయ్య, చేవెళ్ల, సీఐ

అప్పుల ఊబిలో పౌల్ట్రీ రైతులు

మైగ్రేషన్ పేరిట నిలువుదోపిడీ
కంపెనీలు ఆడిందే ఆట
ఏడాదికి నాలుగు బ్యాచ్‌లు
కూడా రాని వైనం
బ్యాంకు కిస్తులూ కట్టలేని దుస్థితి
భూములు అమ్ముకుని
అప్పులు తీర్చే పరిస్థితి



బ్రాయిలర్ ఫౌల్ట్రీఫాంలో కోళ్లపెంపకం

మంచాల : వ్యవసాయ అనుబంధ రంగంగా పాడిగేదెల పెంపకం కొనసాగుతూ వచ్చింది. రైతులు తమ పొలంలో పంటలకు తోడు కొద్దిగా పశుగ్రాసం పెంచుకుని డైరీతో ఉపాధి పొందేవారు. కాగా ఇటీవలి కాలంలో పౌల్ట్రీ పరిశ్రమపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. పాడిగేదెల కంటే కోళ్లపెంపకం కొంచెం డిగ్నిటీగా కనిపించడంతో రైతులు పౌల్ట్రీవైపు మొగ్గుచూపుతున్నారు. దీంతో గ్రామాల్లో ఎక్కడ చూసినా పౌల్ట్రీఫాంలు దర్శనమిస్తున్నాయి. కొద్దిపాటి వ్యవసాయ భూమి ఉన్న రైతులందరూ తమ పొలంలో కోళ్ల షెడ్ వేసుకుని జీవనం సాగిస్తున్నారు. 10 వేల బ్రాయిలర్ కోళ్లు పెంచే ఫాం నిర్మాణానికి సుమారు 14 లక్షల దాకా ఖర్చు అవుతోంది. తమ దగ్గర అంతభారీ మొత్తంలో పెట్టుబడి లేకపోవడంతో రైతులు అప్పుకోసం సమీపంలోని బ్యాంకులను ఆశ్రయిస్తున్నారు. దీంతో బ్యాంకర్లు వ్యవసాయ పొలాలను తాకట్టు పెట్టుకుని పౌల్ట్రీషెడ్ నిర్మాణం కోసం రైతులకు అప్పులు ఇస్తున్నారు. ఇలా ఒక్క మంచాల మండలంలోనే 20 లక్షల కెపాసిటీ గల బ్రాయిలర్ కోళ్ల ఫాంలు ఏర్పాటు చేయబడ్డాయి. వీటిలో 90శాతం పౌల్ట్రీషెడ్‌లు బ్యాంకు రుణాలతో నిర్మించినవి కావడం విశేషం..

మైగ్రేషన్ పేరిట పౌల్ట్రీ కంపెనీల పెత్తనం..

పౌల్ట్రీఫాంలకు పేరుకే రైతులు యజమానులు. చేసేది మాత్రం కూలీ పని కాగా పెత్తనమంత పౌల్ట్రీ కంపెనీలదే.. అదెలాగంటే పౌల్ట్రీ షెడ్ నిర్మాణం పూర్తికాగానే పౌల్ట్రీకంపెనీలు ఆరంగేట్రం చేస్తాయి. కోడిపిల్లల పంపిణీ మొదలుకొని దాణా, మందులు అన్నీ కంపెనీలే సరఫరా చేస్తాయి. పెంపకం మాత్రం రైతులు చూసుకోవాలి. 45 రోజుల పాటు కోళ్లను పెంచిపోషించినందుకు రైతులకు కిలోకు 3 రూ.ల చొప్పున కూలీ చెల్లించబడుతుంది. సొంతంగా కోళ్లపెంపకం, మార్కెటింగ్ కష్టమైన పని కావడంతో పౌల్ట్రీ కంపెనీలు కోడిపిల్లలను రైతులకు చెందిన షెడ్‌లలో పెంచి 45 రోజులు కాగానే మార్కెట్‌కు తరలించి సొమ్ముచేసుకుంటారు. సొంతంగా కోళ్లు పెంచలేని రైతుల అసహాయతను ఈ కంపెనీలు సొమ్ముచేసుకుంటున్నాయి. మంచాల మండలంలో ఉన్న సుమారు 20 లక్షల బ్రాయిలర్ పౌల్ట్రీ ఫాంలలో స్నేహ కంపెనీ 70-80 శాతం వాటా కల్గిఉండగా మిగతా 20 శాతంలో వెంకటేశ్వర తదితర కంపెనీలు బ్రాయిలర్ కోళ్లను పెంచుతున్నాయి.

ఇష్టారాజ్యంగా కోడిపిల్లల పంపిణీ..

పౌల్ట్రీఫాంలో కంపెనీల వ్యవహారం ఇష్టారాజ్యంగా మారింది. మార్కెట్ ధరలకు అనుగుణంగా తము తలచినపుడే కోడిపిల్లలను పంపిణీ చేస్తూ పౌల్ట్రీ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. సాధారణంగా బ్రాయిలర్ కోళ్ల పెంపకం 45 రోజుల్లో పూర్తవుతుంది. షెడ్ సిద్ధం చేయడం కోసం పదిరోజులు కేటాయించినా మొత్తం 55 రోజుల్లో కోళ్ల పెంపకం మార్కెటింగ్ పూర్తికావాలి. అంటే సంవత్సరంలో ఒక్కో షెడ్‌లో కనీసం 6 బ్యాచ్‌లు కోళ్ల పెంపకం చేపట్టాలి. అది నిబంధన కాగా రైతుల నిస్సహాయతను ఆసరాగా చేసుకున్న పౌల్ట్రీ కంపెనీలు అన్నదాతలను తమ గుప్పిట్లో పెట్టుకుని పెత్తనం చెలాయిస్తున్నాయి. అదేమని ప్రశ్నించే ధైర్యం రైతులకు లేకుండా చేశాయి. ఏడాదిలో 3 బ్యాచ్‌లు మాత్రమే సరఫరా చేస్తూ పౌల్ట్రీ రైతుల పొట్ట గొడుతున్నారు.

ఆదాయాన్ని మించి పెంపకం ఖర్చు..
కనీసం ఖర్చులూ చేతికి రాని వైనం..

పేరుకేమో మెగ్రేషన్ కానీ పెంపకం ఖర్చులు మాత్రం పౌల్ట్రీ రైతులే మోస్తున్నారు. కేవలం దాణా సరఫరా వరకే పౌల్ట్రీ కంపెనీలు భరిస్తూ అదనపు పెట్టుబడులు మొత్తం రైతులపై మోపుతున్నారు. 10 వేల బ్రాయిలర్ కోళ్ల పెంపకానికి ఒక్కో బ్యాచ్‌కు రైతులకు 30 వేల రూ.లకు పైగా ఖర్చు వస్తోంది. ఇందులో వరిపొట్టు పరచడం, బొగ్గులతో బ్రూడింగ్, ఎర్రమట్టి, చున్నంతో అలుకు, కోడిపిల్లలకు చుక్కల మందులు వేయడం, లోడింగ్, అన్‌లోడింగ్ తదితర ఖర్చులన్నీ మిళితమై ఉంటాయి. ఇదేగాక బ్యాచ్ పెంపకానికి ఇద్దరు వ్యక్తులు శ్రమించాలి. ఇంత చేస్తే కిలోకి 3 రూ.ల చొప్పున ఒక్కోబ్యాచ్‌కు రైతులకు చేతికందేది రూ.50-70 వేలు మాత్రమే. అయితే ఇందులో ఖర్చులు పోనూ భార్యాభర్తలు కలిసి పనిచేసిన రైతులకు కనీసం కూలీ కూడా గిట్టదు.

తడిసి మోపెడవుతున్న అప్పులు..

పౌల్ట్రీ రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. తడిసి మోపెడవుతున్న అప్పులతో ఆస్తులమ్ముకునే ప్రమాదం నెలకొంది. 10 వేల సామర్థ్యం గల పౌల్ట్రీఫాం నిర్మాణానికి 14 లక్షల రూ.ల దాకా పెట్టుబడి అవుతోంది. ఈ పెట్టుబడి కోసం రైతులు తమ వ్యవసాయపొలాలను బ్యాంకులో తాకట్టు పెట్టి 5-10 లక్షల రూ.దాకా రుణం పొందుతున్నారు. మిగతా పెట్టుబడి కోసం ప్రైవేటుగా అప్పులు తెచ్చుకుంటున్నారు. మొత్తం 14 లక్షల పెట్టుబడికి 2 రూ.ల మిత్తి లెక్కించినా నెలకు 28 వేల రూ.లు అవుతోంది. అంటే ఏడాదికి పౌల్ట్రీ రైతులు 3 లక్షల 36 వేల దాకా మిత్తీలు కడుతున్నారు. పౌల్ట్రీ ద్వారా వచ్చే ఆదాయం ఖర్చులు పోనూ జీతం కూడా గిట్టడం లేదు. దీంతో బ్యాంకు కిస్తులు కూడా చెల్లించలేని దుస్థితికి అన్నదాతలు చేరుకున్నారు. ఈ తరుణంలో అప్పులు అంతకంతకూ పెరిగి కుప్పలుగా మారుతున్నాయి. ఫలితంగా ఉన్న కొద్దిపాటి ఆస్థులు పోగొట్టుకునే దుర్భర స్థితికి చేరుకున్నారు.

ప్రభుత్వం తక్షణమే స్పందించాలి..
లేదంటే ఆత్మహత్యలే..

ఇప్పటికే పౌల్ట్రీ రైతులు అప్పుల ఊబిలో చిక్కుకుపోయారు. ఏ రైతును కదిలించినా ఉపాధికోసం కోళ్లఫాం వేస్తే ఉన్న భూమే పోయేటట్టుంది అంటూ మానసిక వేదనకు గురౌతున్నారు.

పౌల్ట్రీ రైతుల నిలువుదోపిడీపై ప్రభుత్వం, సామాజిక వేత్తలు తక్షణమే స్పందించాల్సిన అవసరముంది. పౌల్ట్రీ రైతుల దుస్థితిపై సమగ్ర అధ్యయనం చేయాలి.

యుద్ధప్రాతిపదికన ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలి. ముందు పౌల్ట్రీ కంపెనీల దోపిడీని అరికట్టాలి. లేదంటే పౌల్ట్రీరైతుల ఆత్మహత్యల పరంపర కొనసాగే ప్రమాదం పొంచిఉంది.



లింగంపల్లిలో ఎండుతున్న మొక్కజొన్న

కరువు మేఘం

●కలిసిరాని ఖరీఫ్ ●ఎండిపోతున్న పంటలు ●వర్షాభావంతో కోట్ల విలువ చేసే పంటలకు నష్టం
●ఊరిస్తున్న మేఘాలు...ఊగిసలాడుతున్న రైతులు

పరిగి: ఒక్క వర్షం కురిస్తే రైతులకు కోట్ల లాభం జరుగుతుంది. ఎలాగంటే... గత నెల వరకు ఆశాజనకంగా ఉన్న పంటలు ప్రస్తుతం వాన జాడ కానరాకుండా పోవడంలో ఎండిపోతున్నాయి. విత్తనాలు విత్తిన నాటి నుంచి ఆడపాదడపా కురిసిన వర్షాలు ఇప్పుడు కనిపించడకుండా పోయాయి. ప్రస్తుతం చేతికొచ్చిన మొక్కజొన్న, పత్తి లాంటి పంటలకు ఒక వర్షం కురిస్తే కోట్లలో లభాం చేకూరుతుందని రైతులు చెబుతున్నారు. పెట్టుబడి పొలంపైనే ఉండిపోవడంతో రైతులకు కంటి మీద కునకులేకుండా పోయింది. కార్తులు దాటుతున్నా వర్షాలు కురియక అన్నదాతలు ఉసూరుమంటున్నారు. ఇరవై రోజుల నుంచి వర్షం జాడ లేక పోవడంతో విత్తిన పంటలన్నీ ఎండుముఖం పడుతున్నాయి. ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు బోర్ల ద్వారా నీటి సౌకర్యం ఉన్న రైతులు చేస్తున్న ప్రయత్నాలు లాభం లేకపోతున్నాయి. బోర్లలో నీళ్ళు లేకపోవడం, దానికితోడు భూగర్భజలాలు అడుగంటిపోవడంతో ఏమి చేయలేక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిగి సబ్ డివిజన్‌లో జూలై మొదటి వారంనాటికి 90 శాతం పైర్లు సాగైనట్లు చెబుతున్నారు. పరిగి వ్యవసాయ డివిజన్‌లో పంటల సాగుకు పనికి వచ్చే పొలం 36, 517 హెక్టార్లలో సాధారణ సాగుకు అనుకూలంగా ఉండగా, దాదాపు 28 వేల హెక్టార్లలో సాగు చేసినట్లు తెలుస్తున్నది. ఈ విస్తీర్ణంలో మొక్కజొన్న, పత్తి, జొన్న, వేరుశనగ, బెబ్బరులు సాగు చేశారు. ఇప్పటి వరకు సాగు చేసిన పంటలు ఎండకుండా పండితే రూ.20 కోట్ల విలువ గల పంటలు ఉంటాయని అంచనా. వీటిని కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. పరిగి, దోమ, కులకచర్ల, పూడూరు మండలాల్లోని పలు గ్రామాల్లో రైతులు ఎండిపోతున్న పంటలను చూసి కన్నీరు,మున్నీరవుతున్నారు. మెట్ట పంటల పరిస్థితి ఇలా ఉంటే ఇక వరినాటుకోసం నారుమళ్ళు పోసుకున్న రైతుల పరిస్థితి వేరుగా ఉంది. బోర్లు, చెరువుల ఆధారంగా సాగుచేసుకుందామని ఎన్నో ఆశలతో నారుమళ్ళు పోసుకున్నప్పటికీ వర్షాలు కనిపించడకుండా పోవడంతో వరినారు ముదిరిపోతున్నదని రైతుల వాపోతున్నారు. చెలక నేలలు ఉన్న ప్రాంతాల్లో పైర్ల పరిస్థితి దారుణంగా ఉందని రైతులు చెబుతున్నారు. దోమ, కులకచర్ల మండలాలతోపాటు, పరిగి మండలంలోని సగం గ్రామాల్లో ఎక్కడా చూసిన రైతన్నలంతా బోరున విలపిస్తున్నారు. గ్రామాల్లో ఏ నలుగురు రైతులు ఒక చోట జతకూడినా కాలం పోయింది. చేసిన అప్పులు ఎలా తీర్చాలి, పొలాల దిక్కు వెళ్దామంటే ప్రాణం తల్లడిల్లిపోతుందని వెళ్లలేకపోతున్నామంటున్నారు. చెలక నేలలో సాగు చేసిన మొక్కజొన్న, పత్తి, వరి, రాగులు, జొన్న పైర్లు వర్షాలు లేక ఎండుముఖం పడుతున్నాయి. మరో రెండు మూడు రోజుల్లో వర్షాలు కురవకపోతే పంట మొక్కలు పూర్తి స్థాయిలో ఎండిపోయే ప్రమాదం ఉందని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కమ్ముకున్న కరువు మేఘాలు..
పిక్కటిల్లుతున్నరైతులు

ఖరీఫ్ ప్రారంభంలో మెట్టపంటలకు సరిపోను వర్షాలు కురిశాయి. ఆ తర్వాత వర్షం కనిపించకుండా పోయింది. మేఘాలు కుమ్ముకుని ఊరిస్తున్నాయే తప్పా, చినుకురాల్చడం లేదు. ఈ ఏడాది ముందుగానే రుతు పవనాలు రావడంతో మృగశిర సమయంలో కురిసిన వర్షాలు ఎంతో మురిపించాయి. తీరా పంటలు చేతికోచ్చే సరికి ఆ వర్షాలు కానరాకుంగా పోయాయి. జిల్లాలో అక్కడక్కడా కురుస్తున్నా పరిగి నియోజకవర్గంలో మాత్రం వాన చినుకులు అంతంతే. రైతన్న ఆకాశం వైపు కోటి ఆశలతో ఎదురుచూస్తున్నా అక్కడ మాత్రం నీలి మేఘాలపై కమ్ముకున్న కరువు చాయలు కనిపిస్తున్నాయి. అప్పుడప్పుడు కమ్ముకుంటున్న మేఘాలను చూస్తూ వర్షం వచ్చేస్తుందని సంబరపడుతూ, తీరా చినుకు రాలకపోవడంతో తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

అప్పులు చేసి సాగు చేశా...
మల్లారెడ్డి, రైతు బాసుపల్లి, దోమ మండలం



పంటల సాగుకు వేలాది రూపాయల అప్పులు చేసి సాగు చేశా. వర్షాకాలం ఉసూరుమనిపించడంతో వేసిన పంటలు ఎండుముఖం పట్టాయి. దీంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియని పరిస్థితి నెలకొంది. గత ఏడాది కరువు దెబ్బను ఇప్పటికి కోలుకోలేదు. పొలాల్లో పంటలను చూస్తే మనసు చలిస్తున్నది.

'ఆజీవక గ్రామీణ ఎక్స్‌ప్రెస్ యోజన' ముఖ్య ఉద్దేశం?

1. 2020, 2024, 2028 ఒలింపిక్స్‌ల్లో భారత ప్రమాణాల మెరుగుదలకు కావాల్సిన సూచనల నివేదికను కేంద్ర క్రీడల శాఖకు సమర్పించిన ఎనిమిది మంది సభ్యుల కమిటీలో లేనివారు?
ఎ) పుల్లెల గోపీచంద్ బి) వీరేన్ రస్కిన్హ
సి) మిల్కాసింగ్ డి) అభినవ్ బింద్రా

2. భారత సుప్రీంకోర్టు తదుపరి, 45వ ప్రధాన న్యాయమూర్తిగా ఎవరు ఎంపికయ్యారు?
ఎ) జస్టిస్ ఎన్.వి.రమణ బి) జస్టిస్ దీపక్ మిశ్రా
సి) జస్టిస్ రంజన్ గగోయ్
డి) జస్టిస్ సంజన్ కిషన్ కాలే

3. కెన్యా అధ్యక్షుడిగా ఇటీవల తిరిగి ఎవరు ఎన్నికయ్యారు?
ఎ) ఉహురు కెన్యాట్టు బి) డేనియల్ అరప్ మాయి
సి) జోమ్ కెన్యాట్టు డి) మవాయ్ కిబాకి

4. 2017 ఆగస్టు 11న ముప్పవరపు వెంకయ్య నాయుడు భారతదేశానికి ఎన్నో ఉపరాష్ట్రపతిగా ప్రమాణస్వీకారం చేశారు?
ఎ) 15 బి) 14 సి) 16 డి) 13

5. కేంద్ర సెన్సార్ బోర్డు నూతన చైర్మన్?
ఎ) ప్రసూన్ జోషి బి) విద్యాబాలన్
సి) పహలాజ్ నిహలని డి) అదూర్ గోపాలకృష్ణన్

6. 2017లో లండన్ వేదికగా జరిగిన 'ప్రపంచ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్' జావెలిన్ త్రో విభాగంలో ఫైనల్‌కి చేరిన తొలి భారతీయుడు?
ఎ) నీరజ్ చోప్రా బి) దవిందర్‌సింగ్ ఖాంగ్
సి) వికాస్‌గౌడ్ డి) అనిల్‌కుమార్

7. ప్రపంచ జీవ ఇంధన దినోత్సవం?
ఎ) ఆగస్టు 12 బి) ఆగస్టు 10
సి) ఆగస్టు 15 డి) ఆగస్టు 9

8. పర్యావరణ హానికరమైన 50 మైక్రాన్లలోపు ప్లాస్టిక్ బ్యాగ్‌లను 'నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్' ఇటీవల ఏ ప్రాంతంలో నిషేధించింది?
ఎ) చెన్నై బి) బెంగళూరు సి) కోల్‌కతా డి) ఢిల్లీ

9. పేదలకు అతి తక్కువ ధరకు మందులను విక్రయించే 'ప్రధానమంత్రి భారతీయ జనౌషధ పరియోజన(పిఎంబిజెపై)' కేంద్రాలను 1000కి పైగా ఏర్పాటు చేయడానికి కేంద్రంతో ఇటీవల ఒప్పందం కుదుర్చుకొన్న రాష్ట్రం?
ఎ) బీహార్ బి) ఉత్తరాఖండ్
సి) ఉత్తరప్రదేశ్ డి) హర్యానా

10. 2017 నవంబరు 28న జరిగే 'ప్రపంచ భాగస్వామ్య సదస్సు'కు ఆతిథ్యమిస్తున్న నగరం?
ఎ) అహ్మదాబాద్ బి) కాన్పూర్
సి) మద్రాస్ డి) హైదరాబాద్

11. మసూమా ఎబ్తేకర్, మౌలావర్డి అనే మహిళలు ఏ దేశానికి ఉపాధ్యక్షులుగా ఇటీవల నియమితులయ్యారు?
ఎ) ఇరాన్ బి) పాకిస్థాన్ సి) ఇరాక్ డి) జోర్డాన్

12. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు నూతన చైర్మన్?
ఎ) షహర్యార్‌ఖాన్ బి) నజమ్ సేఠి
సి) జహీర్ అబ్బాస్ డి) జావెద్ మియందాద్

13. కేంద్ర స్వయం సహాయక సంఘాల కార్యక్రమాల డిజిటలైజేషన్ కోసం 'ఈ-శక్తి' అనే కార్యక్రమం నిర్వహిస్తున్న సంస్థ?
ఎ) స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
బి) ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
సి) రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా
డి) నేషనల్ బ్యాంక్ ఫర్ రూరల్ అండ్ అగ్రికల్చర్ డెవలప్‌మెంట్

14. 'BIMSTEC' కి సంబంధించి సరైనది?
ఎ) బే ఆఫ్ బెంగాల్ ఇనిషియేటివ్ ఫర్ మల్టీ సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనమిక్ కోఆపరేషన్
బి) 1997 జూన్ 6న ప్రారంభం
సి) సభ్యదేశాలు - బంగ్లాదేశ్, ఇండియా, మయన్మార్, థాయ్‌లాండ్, భూటాన్, నేపాల్, శ్రీలంక డి) పైవన్నీ

15. 2017 ఆగస్టు 8న 'BIMSTEC' దేశాలు తమ తొలి విపత్తు నిర్వహణ విన్యాసాలను ఏ నగరంలో ప్రారంభించాయి?
ఎ) థింపు(భూటాన్)
బి) జయవర్ధనపుర కొట్టె(శ్రీలంక)
సి) నేపిడా(మయన్మార్)
డి) న్యూఢిల్లీ(ఇండియా)

16. అయోధ్య వివాదానికి సంబంధించి అన్ని కేసుల పరిశీలనకు సుప్రీం కోర్టు ఇటీవల నియమించిన ముగ్గురు జడ్జీల కమిటీకి నేతృత్వం వహిస్తున్నది?
ఎ) జస్టిస్ జాస్తి చలమేశ్వర్
బి) జస్టిస్ దీపక్ మిశ్రా
సి) జస్టిస్ కురియన్ జోసఫ్
డి) జస్టిస్ రోహింటన్ పాలి నారిమన్

17. 2017కి గాను UEFA సూపర్ కప్ ఫుట్‌బాల్ టోర్నీ విజేత?
ఎ) రియల్ మాడ్రిడ్ క్లబ్
బి) యునైటెడ్ మాంచెస్టర్స్ క్లబ్
సి) బార్సిలోన క్లబ్ డి) మిలాన్ క్లబ్

18. 2017 ఆగస్టులో కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ 'ప్రపంచ ఏనుగుల దినోత్సవం' సందర్భంగా 'గజయాత్ర' ప్రచార కార్యక్రమం ప్రారంభించింది. 'ఏనుగుల దినోత్సవం' ఎప్పుడు?
ఎ) ఆగస్టు 16 బి) ఆగస్టు 9
సి) ఆగస్టు 8 డి) ఆగస్టు 12


ఎస్.మహిపాల్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

జి.కె. అండ్ కరెంట్ అఫైర్స్



19. అంగారక గ్రహంపై మేఘాల దృశ్యాలను చిత్రీకరించిన 'క్యూరియాసిటీ' రోవర్ ఏ దేశానికి చెందింది?
ఎ) జపాన్ బి) రష్యా సి) ఇండియా డి) అమెరికా

20. 2017 అక్టోబరు 19 నుంచి 29 వరకు రష్యా, భారత్ సంయుక్తంగా నిర్వహించనున్న సైనిక విన్యాసాలు?
ఎ) వరుణ బి) గరుడ సి) ఇంద్ర డి) మిత్రశక్తి

21. పదవికి రాజీనామా చేసిన గురుదీప్‌సింగ్ సప్పాల్ స్థానంలో నియమితులైన రాజ్యసభ టి.వి. నూతన సిఇఒ?
ఎ) సూర్యప్రకాశ్ బి) వెంపటి శశిశేఖర్
సి) శోభాసేన్ డి) మృదులాసిన్హా

22. 2017 ఆగస్టు 9, 10 తేదీల్లో 'ఇండియన్ టెక్నాలజీ కాంగ్రెస్'ను నిర్వహించిన నగరం?
ఎ) బెంగళూరు బి) హైదరాబాద్
సి) అలహాబాద్ డి) కోల్‌కతా

23. 'భారత్-ఆసియాన్ దేశాల యువసదస్సు'కి ఆతిథ్యం ఇచ్చిన నగరం?
ఎ) భోపాల్(మధ్యప్రదేశ్)
బి) మాండలే(మయన్మార్)
సి) కంపాంగ్ చామ్(కంబోడియా)
డి) సిసిలి(ఇండోనేషియా)

24. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ ఇటీవల రూపొందించిన మూకీ(సంజ్ఞలు) భాషలో 'జనగణమన'కు దర్శకత్వం వహించింది?
ఎ) మధుర్ బండార్కర్ బి) అభిషేక్ చౌబే
సి) గోవింద్ నిహలాని డి) అలంక్రిత్ శ్రీవాస్తవ్

25. 2017 ఆగస్టులో భారత కోస్ట్‌గార్డ్ దళం ప్రవేశపెట్టిన తీరగస్తీ నౌక?
ఎ) ఐఎన్ఎస్ మిత్ర బి) ఐఎన్ఎస్ మౌర్య
సి) ఐఎన్ఎస్ శౌర్య డి) ఐఎన్ఎస్ సుచిత్ర

26. 2017కి గాను 'ద హ్యూగో అవార్డు' పొందిన నవల 'ద ఒబిలిస్క్ గేట్' రచయిత?
ఎ) ఎన్.కె.జెమిసిన్ బి) నోరా.కె.జెమిసిన్
సి) జేవియర్ మోరో డి) అనురాధ రాయ్
(ఎ) ఎన్.పి.ఉల్లేఖ్ బి) నోరా.కె.జెమిసిన్)

27. 2017 నవంబరులో జరగాల్సిన అండర్ 19 క్రికెట్ ఆసియా కప్ ఆతిథ్య వేదికను బెంగళూరు నుంచి ఎక్కడికి మార్చారు?
ఎ) శ్రీలంక బి) మలేషియా
సి) బంగ్లాదేశ్ డి) పాకిస్థాన్

28. కుష్టు వ్యాధి నివారణ కోసం పోరాడి ఇటీవల మరణించిన 'రూత్‌ఫౌని ఏ దేశంలో మదర్ 'మదర్ థెరిసా'గా వ్యవహరిస్తున్నారు?
ఎ) పాకిస్థాన్ బి) కజకిస్థాన్
సి) శ్రీలంక డి) నేపాల్

29. కజకిస్థాన్ రాజధాని అస్తానా వేదికగా ముగిసిన ఆసియా ఛాంపియన్‌షిప్‌లో కాంస్యం సాధించిన మహేశ్వరి చౌహాన్ ఏ క్రీడకు చెందిన వ్యక్తి?
ఎ) ఆర్చరీ బి) బాక్సింగ్ సి) టెన్నిస్ డి) షూటింగ్

30. 'దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన'లో భాగంగా కేంద్రం ప్రారంభించిన 'ఆజీవక గ్రామీణ ఎక్స్‌ప్రెస్ యోజన' ముఖ్య ఉద్దేశం?
ఎ) అసహాయ వర్గాలకు పెన్షన్ అందించడం
బి) వ్యవసాయ రంగంలో ఉచిత ట్రాక్టర్లు అందించడం
సి) గ్రామీణ ప్రాంతాల్లో రవాణా స్వయం సహాయక సంఘాలు నిర్వహించడం
డి) బ్యాంకింగ్ రంగంలో గ్రామీణ పరపతిని పెంచడం

31. ఎడిస్ ఈజిప్ట్ ద్వారా సంక్రమించే జికా వైరస్ క్యూలెక్స్ దోమల ద్వారా సంక్రమిస్తుందని ఏ దేశ శాస్త్రవేత్తల పరిశోధనలు వెల్లడించాయి?
ఎ) కెనడా బి) సెనెగల్ సి) పెరూ డి) బ్రెజిల్

32. SATH(సస్టైనబుల్ యాక్షన్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ హ్యూమన్ క్యాపిటల్) కార్యక్రమంలో భాగంగా 'నీతి ఆయోగ్' ఆరోగ్య కార్యక్రమాలు అమలుచేస్తున్న మూడు రాష్ట్రాల్లో లేనిది?
ఎ) కర్ణాటక బి) అస్సాం సి) హర్యానా డి) ఉత్తరప్రదేశ్

33. SATH కార్యక్రమంలో భాగంగా 'నీతి ఆయోగ్' విద్య కార్యక్రమాలు అమలు చేస్తున్న మూడు రాష్ట్రాల్లో లేనిది?
ఎ) బీహార్ బి) ఒడిశా సి) జార్ఖండ్ డి) మధ్యప్రదేశ్

34. ఏ కార్యక్రమం 75 సంవత్సరాల ఉత్సవాల సందర్భంగా మోదీ నూతన భారత నిర్మాణం కోసం 'సంకల్ప్ సె సిద్ధి' అనే ప్రచారానికి పిలుపునిచ్చారు?
ఎ) చంపారన్ ఉద్యమం
బి) క్విట్ ఇండియా ఉద్యమం
సి) సహాయ నిరాకరణ ఉద్యమం
డి) శాసన ఉల్లంఘన ఉద్యమం

35. ఇటీవల గుజరాత్ నుంచి రాజ్యసభకు ఎన్నికైన ముగ్గురిలో లేనివారు?
ఎ) స్మృతి ఇరాని బి) అహ్మద్ పటేల్
సి) శంకర్ సింహ్ వాఘేలా డి) అమిత్‌షా

36. ఇటీవల మరణించిన కేంద్ర మాజీ మంత్రి, ప్రస్తుత అజ్మీర్ ఎం.పి. సన్వర్‌లాల్ జాట్ ఏ పార్టీకి చెందినవారు?
ఎ) నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సిపి)
బి) భారతీయ జనతాపార్టీ(బిజెపి)
సి) ఇండియన్ నేషనల్ లోక్‌దళ్(ఐఎన్ఎల్‌డి)
డి) ఇండియన్ నేషనల్ కాంగ్రెస్(ఐఎన్‌సి)

37. ఆసియా సొసైటీ నుంచి 2017కి గాను 'ఆసియా గేమ్ చేంజర్స్ అవార్డు'కి ఎంపికైనది?
ఎ) నరేంద్ర మోదీ బి) రవీంద్ర జడేజా
సి) జాక్ మా డి) దేవ్ పటేల్

